ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 22 జూలై 2024

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755





కన్నులపండువగా శ్రీవారి గరుడవాహనసేవ

తిరుమల క్షేత్రంలో ఆదివారం గరుడసేవ కన్నులపండువగా జరిగింది. గురుపౌర్ణమి సందర్భంగా విశేష అలంకరణలో మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరి ఆదివారం రాత్రి ఏడు గంటలకు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించారు. ఆదివారం సెలవుదినం, గురుపౌర్ణమి కూడా కావడంతో భక్తులు భారీగా మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుని ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వాహనసేవ వైభవంగా జరిగింది. గ్యాలరీల్లోని భక్తులు కర్పూర హారతులిస్తూ గోవిందనామస్మరణలతో స్వామిని దర్శించుకుని ఆనందపరవశులయ్యారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి



తిరుపతి రాఘవేంద్రనగర్‌లోని సాయిబాబా ఆలయంలో భక్తుల రద్దీ



వైభవంగా గురుపూజోత్సవం

గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా గురుపూజోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయిబాబా ఆలయాలైతే భక్తులతో కిక్కిరిశాయి.

టీడీపీ, వైసీపీ శ్రేణుల ఘర్షణ

- పాకాలలో ఉద్రిక్తత
- భారీగా చేరుకున్న పోలీసు బలగాలు



పాకాల పోలీసు స్టేషన్ ఎదుట ఘర్షణ పడుతున్న టీడీపీ, వైసీపీ శ్రేణులు, చుట్టుముట్టిన పోలీసులు

పాకాల, జూలై 21: టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య పాకాలలో ఆదివారం ఘర్షణ జరిగింది. దీంతో ఉద్రిక్తత వాతావరణ నెలకొంది. మధ్యాహ్నం పాకాల మండలంలోని దేశిరెడ్డిపల్లెలో ఓ ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి వస్తున్న టీడీపీ యువకులకు పంటపల్లె సమీపంలో వైసీపీ యువకులు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఆపై పాకాల పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న వైసీపీ నేతకు చెందిన దుస్తుల దుకాణం వద్ద మరోసారి ఘర్షణ పడ్డారు. తిరిగి సాయంత్రం వైసీపీ, టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్ వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఈ సమయంలో మళ్లీ ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎవరిమీద ఎవరు దాడి చేస్తున్నారో తెలియక కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీ నరసింగప్ప, సీఐ శ్రీరాముడు, ఎస్‌ఐలు, వందమందికిపైగా సాయుధ బలగాలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఎదుట ఘర్షణ పడుతున్న ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ సందర్భంగా గాయపడిన ఇరువర్గాల వారూ పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

మేమొచ్చేస్తాం ప్లీజ్..!

- కూటమిలో చేరేందుకు వైసీపీ కార్పొరేటర్ల ఉత్సాహం
- కెన్సెస్ హోటల్లో ఎన్వీప్రసాద్‌తో సుదీర్ఘ మంతనాలు
- డిప్యూటీ మేయర్ ముద్రతోపాటు పదిమందికిపైగా చేరేందుకు సిద్ధం



కెన్సెస్ హోటల్ వద్ద వైసీపీ కార్పొరేటర్లు

తిరుపతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అనుకున్నదే అవుతోంది. తిరుపతి కార్పొరేషన్‌లోని వైసీపీ కార్పొరేటర్లు ఎన్డీఏ కూటమిలో చేరేందుకు పడుతున్న ఉత్సాహం ఓ కొలిక్కి వస్తోంది. వైసీపీలో ఇక ఇమడలేమని, మేమొచ్చేస్తాం ప్లీజ్..! అంటూ పలువురు ముందుకొస్తున్నారు. ఈనేపథ్యంలో తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్ నేతృత్వంలో ఆదివారం స్థానిక కెన్సెస్ హోటల్లో రహస్య సమావేశం జరిగింది. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో పాటు కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రనాథ్, అమరనాథ్ రెడ్డి, అనిల్, కుడితి సుబ్రమణ్యం, మహిళా కార్పొరేటర్ల భర్తలు, కుటుంబ సభ్యులు దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, తిరుత్తణి వేణుగోపాల్, దూది శివ, బాలాజీ తదితరులు హాజరైనట్టు తెలిసింది. ఒక్కొక్కరు వేర్వేరుగా ఎన్వీ ప్రసాద్‌తో సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. బేషరతుగా కూటమిలో చేరుతామని కొందరు చెబితే, మరికొంత మంది వారి వ్యక్తిగత డిమాండ్లను, మళ్లీ కార్పొరేటర్ టికెట్ తమకే ఇవ్వాలన్న నిబంధన కూడా పెట్టినట్టు తెలిసింది. అదేవిధంగా అవిశ్వాసంలో కొత్తకౌన్సిల్ కొలువుతీరితే డిప్యూటీ మేయర్ పదవులను తమకే ఇవ్వాలని పలువురు కోరినట్టు సమాచారం.

మేయర్ రాకకోసం

కౌన్సిల్లో కూటమి పార్టీలకు బలం పెరిగినా నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టి మేయర్‌ను తొలగించే అవకాశం లేదు. కౌన్సిల్ ఏర్పాటై ఇప్పటికి మూడన్నరేళ్లు దాటేసింది. అయితే ప్రస్తుత మేయర్ డాక్టర్ శిరీష కూటమి పార్టీలో చేరిపోతే ఆమే మేయర్‌గా అధికార పక్షంలో కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మళ్లీ ఎన్నికలు జరిగేవరకు ఆమెనే కొనసాగించేందుకు మెజార్టీ కార్పొరేటర్లు కూడా ఆసక్తి చూపుతున్నారు. ఒకవేళ ఆమె వైసీపీలోనే కొనసాగితే మరో ఆరు నెలల్లో అవిశ్వాస తీర్మానానికి కూటమి కార్పొరేటర్లు సిద్ధపడే అవకాశం ఉంది. మేయర్ కూటమిలో చేరుతుందన్న ప్రచారం ఓవైపు జరుగుతున్నప్పటికీ ఆమె నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొని ఉంది.

గాజు బాటిళ్లలో తక్కువ ధరకే నీరు

తిరుమలలో భక్తులకు అందించడానికి బ్రాండెడ్ సంస్థలను ఆహ్వానించనున్న టీటీడీ

శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు గాజు బాటిళ్లలో తక్కువ ధరకే నీరందించడానికి టీటీడీ కసరత్తు మొదలు పెట్టింది. ఇందుకోసం బ్రాండెడ్ వాటర్ బాటిళ్ల విక్రయ సంస్థలను ఆహ్వానించేందుకు సిద్ధమవుతోంది.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి



ప్రస్తుతం తిరుమలలో విక్రయిస్తున్న గాజు బాటిళ్లు

తిరుమలలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల విక్రయాలను నిలిపివేయాలని 2019 డిసెంబరు నెలలో టీటీడీ ఆదేశాలు జారీ చేసింది. 2020నుంచే కొండపైకి ప్లాస్టిక్ వాటర్‌బాటిళ్ల రాక నిలిచిపోయింది. దాంతో భక్తులు కొద్దినెలలపాటు జల ప్రసాదాలపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఆ తర్వాత గతంలో ప్రముఖ వాటర్ బాటిళ్లను తిరుమలకు సరఫరా చేసే ఎనిమిది కంపెనీల డీలర్లు టీటీడీ ఉన్నతాధికారులను కలిసి హఠాత్తుగా వాటర్‌బాటిళ్ల విక్రయాలను ఆపేస్తే తాము రోడ్డుపై పడతామని, గాజు బాటిళ్లలో తాగునీరు సరఫరా చేసే అవకాశమివ్వాలంటూ కోరారు. ఆ క్రమంలోనే ఆ తొమ్మిది మంది డీలర్లు, గత వైసీపీ రాజకీయ సిఫారసుతో వచ్చిన మరో డీలరు లోకల్‌గా ఉన్న ప్లాంట్ నుంచి ఏడు లోకల్ బ్రాండ్లతో నీటిని సరఫరా చేస్తూ వస్తున్నారు. రూ.50లకు వాటర్ బాటిల్ విక్రయిస్తారు. బాటిల్‌ను వెనక్కిచ్చేస్తే తిరిగి రూ.30 భక్తుడికి ఇస్తారు.

బహిరంగ ప్రకటనతో పెద్ద బ్రాండ్లకు ఆహ్వానం

నిబంధన ప్రకారం వాటర్ బాటిళ్ల విక్రయాలు జరగడం లేదని ఫిర్యాదులు ఇప్పటికే టీటీడీకి అందాయి. గాజుబాటిల్ తిరిగి ఇస్తున్నప్పటికీ డిపాజిట్ ఇవ్వడం లేదని కొందరు, రూ.50 బాటిల్‌కు రూ.60, రూ.70 విక్రయిస్తున్నారని మరి కొందరి నుంచి ఫిర్యాదులు అందాయి. దీనిపై ఇప్పటికే ఈవోగా బాధ్యతలు స్వీకరించిన శ్యామలరావు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇటీవల శ్రీవారి మెట్టుమార్గంలో ఓ దుకాణంలో తనిఖీలు చేసి అధిక ధరకు బాటిల్ విక్రయిస్తున్నట్టు గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతమున్న లోకల్ బ్రాండ్ల నీటి నాణ్యత బాగానే ఉన్నప్పటికీ పెద్ద కంపెనీలను బహిరంగ ప్రకటనతో ఆహ్వానించాలని భావిస్తున్నారు. తద్వారా క్వాలిటీ వాటర్‌ను తక్కువ ధరకు భక్తులకు అందజేయవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రముఖ నీటి సరఫరా కంపెనీలు లోకల్ బ్రాండ్ ధరలకే విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

26 మంది పీఎస్‌ఐల బదిలీ

తిరుపతి (నేరవిభాగం), జూలై 21: ఎన్నికల నేపథ్యంలో అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి మన జిల్లాకు వచ్చిన 26 మంది రిజర్వు పీఎస్‌ఐలను బదిలీ చేశారు. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆయా జిల్లాల్లో పనిచేస్తున్న మన జిల్లాకు 17 మంది పీఎస్‌ఐలను కూడా ఇక్కడికి బదిలీ చేశారు. వీరందరూ తక్షణమే రిలీవ్ అయి తమ, తమ జిల్లాల ఎస్పీల వద్ద రిపోర్టు చేసుకోవాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.



ప్రొఫెసర్లతోపాటు జాతీయ గీతం ఆలపిస్తున్న గోపాలకృష్ణన్, సజ్జన్ జిందాల్, కేఎన్ సత్యనారాయణ

సామాజిక బాధ్యత అలవర్చుకోండి

- ఇన్ఫోసిస్, యాక్సిలర్ వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ గోపాలకృష్ణన్
- ఘనంగా ఐఐటీ ఆరో స్నాతకోత్సవం
- 338మంది విద్యార్థులకు డిగ్రీల ప్రదానం

ఏర్పేడు, జూలై 21: ప్రతి విద్యార్థీ సామాజిక బాధ్యత అలవర్చుకోవాలని ఇన్ఫోసిస్, యాక్సిలర్ వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ గోపాలకృష్ణన్ పిలుపునిచ్చారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో ఆరో స్నాతకోత్సవాన్ని అధికారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 3.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం ఆరు గంటలకు ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన క్రిస్ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు కోఫైలెట్‌గా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. సాంకేతికత అనేది కేవలం ఒక సాధనం మాత్రమే కాకుండా సహ ఇంటెలిజెన్స్ భాగస్వామి అని చెప్పారు. సాంకేతికత కొత్త అవకాశాలను సృష్టిస్తోందని తెలిపారు. తిరుపతి ఐఐటీలో చదువుకోవడం అదృష్టవంతులుగా భావిస్తున్నానన్నారు. మీరు చేసే అన్ని ప్రయత్నాల్లో శ్రేష్టత కోసం కృషి చేయాలని అన్నారు.

2047నాటికి వీక్షిత్ భారత్‌గా మార్చాలి: సజ్జన్ జిందాల్

మనదేశాన్ని 2047నాటికి వీక్షిత్‌భారత్‌గా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రయత్నం చేస్తోందని బోర్డు ఆఫ్ గవర్నర్స్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ అన్నారు. స్నాతకోత్సవానికి సహ ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వీక్షిత్‌భారత్ కోసం చాలా సమగ్రమైన విధానం అవసరమని చెప్పారు. అంతేకాకుండా పౌరులందరి పట్టుదల, అంకితభావంతో మాత్రమే అది సాధ్యమవుతుందన్నారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం 1,500 మంది చదువుతున్నారన్నారు. వీరందరికీ అవసరమైన వసతులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఐసర్ డైరెక్టర్ శాంతనూ భట్టాచార్య, ఐఐటీ పీఆర్వో చమన్ మెహతా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేష్ కుమార్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అవార్డులు, డిగ్రీలిలా..

క్రిస్ గోపాలకృష్ణన్, సజ్జన్ జిందాల్ చేతుల మీదుగా అవార్డులను విద్యార్థులు అందుకున్నారు. ప్రెసిడెంట్ అవార్డును అనూష్ మంగళ్, గవర్నర్స్ అవార్డును ఎంఎస్ స్నేహ, ప్రొఫెసర్ కంటమ్ కృష్ణయ్య అవార్డును అరిమంత భవన్‌రెడ్డి, రామకృష్ణ లక్ష్మీకాంత మెమోరియల్ ప్రైజ్‌ను ప్రశాంత్‌సింగ్, అమరరాజా గ్రూప్ అవార్డును డేవిడ్సన్ పొల్ల, ఇన్‌స్టిట్యూట్ అవార్డులను జనపతి వెన్నెలదేవి, ఇందుకూరి నాగమహిత అందుకున్నారు. అలాగే 210మంది బీటెక్ డిగ్రీలు, 76మందికి ఎంటెక్, 28మందికి ఎమ్మెస్సీ, 16మందికి ఎంపీపీ, ముగ్గురికి ఎంఎస్ పరిశోధన, ఐదుగురికి పీహెచ్‌డీ, ఇన్‌స్టిట్యూట్ నుంచి ఒకరికి డిప్లొమా డిగ్రీలు ప్రదానం చేశారు. మొత్తంగా 338మంది విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారు. ఈ స్నాతకోత్సవం ప్రారంభానికి ముందు అమరరాజా గ్రూప్ ఛైర్మన్, అండ్ డైరెక్టర్ మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఐఐటీని సందర్శించారు. అనంతరం ఐఐటీ అధికారులతో సమావేశమై అమరరాజా గ్రూప్‌సంస్థ బ్యాటరీ తయారీ రంగంలో ఎలా ముందుకు పోతుందో అనే విషయాలను వివరించారు. స్నాతకోత్సవానికి విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రొఫెసర్లు, నిపుణులు హాజరయ్యారు. దీంతో పండుగ వాతావరణం నెలకొంది.









ప్రశాంత్‌సింగ్ (రామకృష్ణ లక్ష్మీకాంత్ మెమోరియల్ అవార్డు) | డేవిడ్‌సన్ పొల్ల (అమరరాజ గ్రూప్ అవార్డు) | ఇన్‌స్టిట్యూట్ అవార్డు అందుకుంటున్న ఇందుకూరి నాగమహిత, జనపతి విన్నెలదేవి





ప్రెసిడెంట్ అవార్డుతో అనూష్ మంగళ్, ఎంఎస్ స్నేహకు గవర్నర్స్ అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులతో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

పూర్వజన్మ సుకృతం

ప్రెసిడెంట్ అవార్డు అందుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. ఇంత మందిలో నాకు అవార్డు రావడం గర్వంగా ఉంది.

\- అనూష్ మంగళ్, ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత

ఆనందంగా ఉంది

నాకు గవర్నర్స్ అవార్డు రావడం ఆనందంగా ఉంది. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు. ప్రతి ఒక్కరూ బాగా చదుకోవాలని కోరుతున్నా.

\- ఎంఎస్ స్నేహ, గవర్నర్స్ అవార్డు గ్రహీత

కన్నులపండువగా శ్రీనివాస కల్యాణం


దేవరకొండలో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

భాకరాపేట, జూలై 21: చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం శ్రీనివాస కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం అభిషేకం, అర్చనలు చేశారు. మధ్యాహ్నం వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామికి ఊంజల్ సేవ, రాత్రి గరుడ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాని చొరవతో సస్యశ్యామలం

తలకోన నీటి సాధన కమిటీ

ఎర్రావారిపాలెం, జూలై 21: తలకోన అటవీ పరివాహక నీటిని ఎర్రావారాపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాల చెరువులకు మళ్లించేందుకు అధికార యంత్రాంగానికి ఎమ్మెల్యే నాని తగు సూచనలు ఇవ్వడంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం కానున్నదని తలకోన నీటి సాధన కమిటీ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం బోడేవాండ్లపల్లెలో జరిగిన కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ రెండు మండలాలకు శాశ్వతంగా సాగు, తాగునీరు సమృద్ధిగా ఉండేందుకు శేషాచలం అడవుల్లో వర్షపు నీరు గొలుసు చెరువులకు మళ్లించడం ద్వారానే రైతు కష్టాలు తీరనున్నాయని ఎమ్మెల్యే నాని గుర్తించారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సర్వే పనులను అధికారులు చేపట్టడం ఆయన నిజాయితీకి నిదర్శనమన్నారు. కాలువల ద్వారా గొలుసు చెరువులను, రిజర్వాయర్లను నీటితో నింపడంతో భూగర్భ జలాలు భారీగా పెరగనున్నాయని తెలిపారు. కమిటీ సభ్యులు వెంకట్రమణ, సురేంద్ర, జయేంద్ర, విశ్వనాథ, రైతు మనోహర్, శ్రీకాంత్, సిద్ధయ్య, ఓబులేశు, రవి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడోత్సవం



చంద్రగిరి, జూలై 21: శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గరుడోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా శనివారం సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని పట్టుపీతాంబురాలు, బంగారు ఆభరణాలతో విశేషంగా అలంకరించి గరుడ వాహనంపై అధిష్ఠించగా ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్ పాల్గొన్నారు.

కుంభాభిషేక పోస్టర్ల ఆవిష్కరణ



చంద్రగిరి, జూలై 21: చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవ పోస్టర్లను ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు ఆదివారం ఆవిష్కరించారు. ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహించడంతో ఆగస్టు 7 నుంచి 9వ తేది వరకు కుంభాభిషేకం నిర్వహించనున్నారు. పులివర్తి నాని దంపతులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో పుట్టా రామకృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా టీడీపీ నాయకుడు వసంతనాయుడు ఆలయ పునర్నిర్మాణానికి రూ.2,50,116 ఎమ్మెల్యే దంపతులు చేతులమీదుగా ఆలయ ఈవోకు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు



పాకాల, జూలై 21: పాకాలలో హజరత్ షేక్ షరీఫ్ మస్తాన్ ఔలియా దర్గా వద్ద ఉరుసు సందర్భంగా ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగించారు. ప్రత్యేకంగా పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన వాహనంలో పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి ఖవాలీ గాయకులచే పాటకచ్చేరి నిర్వహించారు. ఈ సందర్భంగ దర్గా వద్ద విశేష సంఖ్యలో హిందూ ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు.

ఆకట్టుకున్న హిడింబాసుర వధ



రామచంద్రాపురం, జూలై21:పరమాల మహాభారత ఉత్సవాల్లో భాగంగా భాగవతారిణి సుమతి వినిపించిన హిడింబాసుర వధ సభికులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు మేళతాళాల నడుమ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమేష్‌నాయుడు, సురేంద్రనాయుడు, జయరామిరెడ్డి, దుర్వాసులు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

తిమ్మరాజుపల్లి రహదారికి మరమ్మతులు


ఎక్స్‌కవేటర్‌తో పూడ్చుతున్న గుంతలు - ముళ్లపొదలు తొలగించాక శుభ్రమైన రోడ్డు

రామచంద్రాపురం, జూలై21: మండలంలోని తిమ్మరాజుపల్లి నుంచి చంద్రప్పనాయుడు కండ్రిగ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారిని ఎమ్మెల్యే నాని ఆదేశాలతో ఆదివారం టీడీపీ నాయకులు యంత్రాలతో మరమ్మతులు చేపట్టారు. ఎన్నికల ముందు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా కొద్దిరోజులకే పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాహనచోదకులు ప్రమాదాల బారిన పడి ముగ్గురు చనిపోయారు. విషయం తెలుసుకున్న నాని రోడ్డు మరమ్మతులు చేయాల్సిందిగా టీడీపీ నాయకులను ఆదేశించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలతోపాటు గుంతల్లో మట్టి తొలగించి శుభ్రపరిచారు. ఎస్‌ఆర్ కమ్మపల్లికి చెందిన హనుమంతనాయుడు, శేఖర్‌నాయుడు, రతీష్ పవన్ తమ సొంత నిధులతో మరమ్మతులు చేశారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



రామచంద్రాపురం, జూలై 21: తిరుపతి డీఎస్‌ఆర్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం రాయలచెరువుపేటలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన వచ్చింది. వందమందికిపైగా వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ సర్పంచులు మాధవి, నాగభూషణం, వైద్యులు నారాయణరెడ్డి, చైతన్య, సంగీత పాల్గొన్నారు.

తప్పులు చేస్తూ తప్పటడుగులు వేస్తున్న చెవిరెడ్డి

● ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుచానూరు, జూలై 21: మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తప్పులు చేస్తూ తప్పటడుగులు వేస్తున్నాడని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనపై హత్యాయత్నం కేసులో కాల్ డేటా, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారాలు పోలీసుల వద్ద ఉన్నాయన్నారు. మోహిత్‌రెడ్డి ముద్దాయని తేలడంతో ముందస్తు బెయిల్ కోసం ఎందుకు అప్లై చేశావని ప్రశ్నించారు. 'ఒకవైపు మోహిత్‌రెడ్డి నీ కొడుకు వంటి వాడే అని రాయబారం పంపుతావు. మరో వైపు నా కుటుంబంపై నిందలు వేస్తావ' అని ఆ ప్రకటనలో విమర్శించారు. హత్యాయత్నం జరిగితే 34 మందిపై పోలీసులు కేసులు పెట్టారని ఆరోపిస్తున్నాడన్నారు. గతంలో 37మంది టీడీపీ నాయకులపై 307 కేసులు పెట్టిన విషయం మరిచావా అని ప్రశ్నించారు. చెవిరెడ్డి ఎన్ని కుతంత్రాలు చేసినా చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే నాని నాటకాలు : చెవిరెడ్డి

తిరుపతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసమే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని నాటకాలాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన పద్మావతి మహిళా వర్శిటీ వద్ద పోలింగ్ అనంతరం జరిగిన ఘటనలో నానీకి ఎలాంటి గాయాలు కాలేదంటూ స్విమ్స్ వైద్య నివేదికలను ఆదివారం మీడియాకు విడుదల చేశారు. అతడి స్వార్థంతో చేసిన నాటకం వల్ల అనేక మంది అమాయకులు జైలులోనూ, వారి కుటుంబసభ్యులు ఇంటి వద్ద రోదిస్తున్నారన్నారు. అక్రమ సస్పెన్షన్లతో అల్లాడుతున్న పోలీసు అధికారులు మనోవేదనకు గురౌతున్నారన్నారు.

ప్రతిపక్షంలో ధైర్యంగా పోరాడదాం

తిరుపతి రూరల్: నియోజకవర్గంలో టీడీపీ నేతలను దీటుగా ఎదుర్కొనేందుకు ప్రతిపక్షపార్టీగా ధైర్యంగా పోరాడదామని చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. తుమ్మలగుంటలోని తన నివాసంలో ఆదివారం ఆరు మండలాలకు చెందిన ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీనేతలు, కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని చెప్పారు.

ఎమ్మెల్యే నాని, సీఆర్ రాజన్‌లపై అసత్య ఆరోపణలు


విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ బీసీ నాయకులు

చంద్రగిరి, జూలై 21: 'బీసీల పార్టీ అయిన టీడీపీలో సీఆర్ రాజన్ చేరడంతో ఆయనకు తగిన పదవి ఇచ్చారు. దీన్ని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే పులివర్తి నానీపై, రాజన్‌పై, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారు' అని మండల టీడీపీ బీసీ నాయకుడు చిన్నతంబు గోపీకృష్ణ అన్నారు. ఆదివారం చంద్రగిరిలో టీడీపీ బీసీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకే చెవిరెడ్డి గుర్తింపు ఇవ్వలేదని విమర్శించారు. బీసీ నాయకులు మణికంఠయాదవ్, శేఖర్, బాలకిషోర్, సుబ్రమణ్యంయాదవ్, కోటేశ్వరరావు, హరి, లోకాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

చంద్రగిరి, జూలై 21: చంద్రగిరి బజారు వీధిలోని సాయిబాబా మందిరంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి సాయిబాబాను దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది భక్తులు సాయిబాబాను దర్శించుకున్నారు. రాత్రి శేష వాహనంపై బాబాను చంద్రగిరి పురవీధుల్లో ఊరేగించారు. తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన సాయిబాబా మందిరంలో విశేష పూజలు నిర్వహించి, బాబాకు పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు కొమ్మినేని సురేంద్రనాయుడు, దినకర్‌రెడ్డి, మేడసాని ప్రకాష్‌నాయుడు, సదానందాచారి, భక్తులు పాల్గొన్నారు. అలాగే మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలోని సాయిబాబా మందిరంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ ఎం.మోహన్‌బాబు పూజలు నిర్వహించారు.

రామచంద్రాపురం : మండలంలోని శ్రీశక్తిపీఠం, రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. శ్రీశక్తి పీఠంలో శ్రీకృష్ణుడు, సాయిబాబా మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. భవానీ జలకంఠేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. వేదపండితులు కాళీ హోమం నిర్వహించి పూర్ణాహుతితో ముగించారు. కార్యక్రమంలో కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామి పాల్గొన్నారు.


చంద్రగిరిలో సాయిబాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే నాని దంపతులు - ఎంబీయూలో సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న మోహన్‌బాబు

శాస్త్రోక్తంగా జీయంగార్ల చాతుర్మాస దీక్ష



తిరుమల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం పెద్దజీయర్ నేతృత్వంలో చాతుర్మాస దీక్ష సంకల్పం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్దజీయర్‌స్వామి మాట్లాడుతూ.. శ్రీవైష్ణవ సంప్రదాయకర్త రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాస దీక్ష విశేషమైనదన్నారు. ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లి తిరిగి కార్తీకశుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటారని తెలిపారు. ఈక్రమంలో నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాసం అంటారని, చాతుర్మాస వ్రతం ప్రాచీనకాలం నుంచే ఆచరణలో ఉన్నట్టు పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. అంతకుముందు పెద్దజీయర్ మఠంలో కలశస్థాపన, కలశ పూజ, విష్వక్సేనారాధన, మేదినపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తర్వాత సేకరించిన పుట్టమన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం పెద్దజీయర్ తిరుమల బేడి ఆంజనేయస్వామి ఆలయం పక్కనే ఉన్న జీయర్ మఠం నుంచి చిన్నంజీయర్‌స్వామి శిష్యబృందంతో కలిసి బయల్దేరారు. క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ తొలత వరాహస్వామిని దర్శించుకున్నారు. అక్కడినుంచి మంగళవాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. జీయర్‌స్వాములు శ్రీవారిని దర్శించుకున్న తర్వాత పెద్దజీయర్‌కు మేల్‌చాట్ వస్త్రాన్ని, చిన్నజీయర్‌కు నూల్‌చాట్ వస్త్రాన్ని బహూకరించారు. అనంతరం పెద్దజీయర్ మఠంలో జీయర్‌స్వాములు ఈవో, జేఈవోలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో దారుణాలు

● తాజాగా జరిగిన రెండు ఘటనలే నిదర్శనం ● రాత్రి గస్తీలు, బీట్‌లు కొరవడటమే కారణమంటున్న మహిళా సంఘాలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 21: గంజాయి మత్తులో దారుణాలు జరుగుతున్నాయి. జిల్లాలో దొరవారిసత్రం, తిరుపతి రాయల్‌నగర్ ప్రాంతాల్లో తాజాగా జరిగిన రెండు ఘటనలే దీనికి నిదర్శనం. ఈ వరుస సంఘటనలతో బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోతోందని మహిళా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

● దొరవారిసత్రం మండలంలో వలస వచ్చిన బిహార్‌కి చెందిన కొన్ని కుటుంబాలు గ్రామంలోని ఒక రైసు మిల్లులో పనిచేస్తున్నాయి. అందులో పనిచేస్తున్న ఓ దంపతుల ఎనిమిదేళ్ల కుమార్తెపై బుధవారం గంజాయి మత్తులో ఉన్న బిహార్ రాష్ట్రంలోని బెహారి ప్రాంతానికి చెందిన దిలీప్‌కుమార్ సదా (20) అత్యాచారం చేశాడు. ఆపై హత్య చేశాడు.

● తిరుపతి రాయల్‌నగర్‌లో గురువారం సాయంత్రం మరో ఘోరం జరిగింది. గంజాయి మత్తులో ఉన్మాదిగా మారిన శ్రీనివాసులు పాత గొడవలు మనసులో పెట్టుకుని ఓ వృద్ధురాలిని కత్తితో గొంతు కోసి దారుణంగా చంపేశాడు. ఆమె ఇద్దరు మనవరాళ్లపైనా దాడి చేశాడు.

మహిళా సంఘాల ఆందోళన

జిల్లాలో రాత్రి గస్తీలు, బీట్‌లు కొరవడటం వల్లే ఇటువంటి దారుణాలు జరుగుతున్నాయని మహిళా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డైనమిక్ బీట్‌లైతే అడ్రస్ లేవు. ఐదేళ్ల కిందటి వరకు ప్రధాన వీధులు, పట్టణాల్లో రాత్రి బీట్ పోలీసులు సైరన్ వేసుకుని రావడం, విజిల్ వేస్తూ.. లాఠీతో రోడ్లపై కొడుతూ వెళ్లేవారు. కొన్ని ఇళ్ల వద్ద బీట్‌ల బుక్ పెట్టి పోలీసులు వచ్చినట్టు సంతకాలు చేసేవారు. ఇవన్నీ ప్రస్తుతం అటకెక్కడంతో జులాయిల ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది. ముఖ్యంగా గంజాయి విక్రయించేవారు, సేవించేవారు ఎక్కువవడంతో మరింత ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. దీనిపై ఎస్పీ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

శాస్త్రోక్తంగా మహా చండీయాగం


పూర్ణాహుతి పూజాసామగ్రితో కొండేపాటి గంగాప్రసాద్

సూళ్లూరుపేట, జూలై 21: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ ఆలయంలో ఆషాడ మాసం పౌర్ణమి సందర్భంగా ఆదివారం మహా చండీయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేద పండితుల మంత్రోచ్చరణల నడమ యాగాన్ని నిర్వహించారు. టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహ రించారు. యాగం పూర్తయిన అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ, సునీల్‌కుమార్, పెంచలకోన ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ తానంకి నానాజీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, టీడీపీ నేతలు టి.సుధాకర్ రెడ్డి, ఏ.రమేష్, ఏ.జీ.కిషోర్, జి.నారాయణ రెడ్డి, పెరుమాల్, బి.శ్రీధర్, సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మకు బంగారు పూత వడ్డాణం వితరణ



సూళ్లూరుపేట, జూలై 21: చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి సూళ్లూరుపేటకు చెందిన సతీష్‌బాబు, సురేఖ దంపతులు ఆదివారం వడ్డాణాన్ని వితరణగా అందజేశారు. 198 గ్రాముల వెండికి 60 గ్రాముల బంగారు తాపడం చేసిన వడ్డాణాన్ని సహాయ కమిషనర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, పి.మురళీరెడ్డి, సుధా, టి.సుధాకర్ రెడ్డి, ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పయాగానికి అంకురార్పణ

వడమాలపేట, జూలై 21: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించనున్న పుష్ప యాగానికి ఆదివారం అంకురార్పణ చేశారు. తెల్లవారు జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం అంకురార్పణ చేశారు. మాడవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా సేనాధిపతి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పుట్టమట్టిని ఆలయం నుంచి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు పుట్టమట్టిని మేదినీదేవి రూపంలో అలంకరింపజేసి, మంగళ హారుతులిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మహాగోపురం వద్ద వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అంకురార్పణ గావించారు.


పూజా సామగ్రిని తీసుకెళుతున్న అర్చకులు

నీచరాజకీయాలు మానుకో చెవిరెడ్డీ: టీడీపీ

పుత్తూరు అర్బన్, జూలై 21: ఎన్నికల్లో చంద్రగిరి ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి బుద్ధి రాలేదని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి సిఫార్సుతోనే సీఆర్ రాజన్‌కు టీడీపీ జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టిందని చెవిరెడ్డి వ్యాఖ్యానించడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. పెద్దిరెడ్డి అనుచరుడిగా సీఆర్ రాజన్‌కు గుర్తింపు ఉంటే, గత ఎన్నికల్లో ఆయనకు ఎందుకు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించలేకపోయారో చెవిరెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక బీసీ నాయకుడిగా గుర్తింపు పొందిన సీఆర్ రాజన్ వైసీపీలో ఉన్నప్పుడు తన పక్కన కూడా కూర్చోబెట్టుకునేందుకు కూడా చెవిరెడ్డి ఇష్టపడలేదని విమర్శించారు. చెవిరెడ్డికి, మాజీ మంత్రి పెద్దిరెడ్డికి గ్రూప్ రాజకీయాలు ఉంటే, వారు వారు తేల్చుకోవాలే గాని టీడీపీని, సీఆర్ రాజన్‌ను, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని, ఆయన కుటుంబసభ్యులపై వివాదాస్పదవ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు ఏలుమలైరెడ్డి, పండారం మణి, సంతోష్, కాశీ, చిదంబరం, మహేష్ పాల్గొన్నారు.

తారకరామనగర్‌లో కార్డెన్ సెర్చ్

తారకరామనగర్, జూలై 21: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో ఆదివారం ఉదయం డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ప్రతి ఇంటి వద్ద క్షుణ్ణంగా వివరాలు అడుగుతూ ఆధార్ కార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటోలు, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా రికార్డులు, లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. రికార్డులు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ మల్లికార్జున తెలిపారు. ఈ ప్రాంతంలో ఎవరైనా అనుమానితులు కలిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్ఐ జావీద్‌బాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి వేడుకగా గజవాహన సేవ



తిరుచానూరు, జూలై 21: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారికి ఆదివారం గజవాహన సేవ జరిగింది. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాడ పురస్కరించుకుని అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. సుగంధ పరిమళ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం జరిగింది. సర్వాలంకార శోభితురాలైన పద్మావతి దేవి ఆదివారం రాత్రి తనకు ప్రీతిపాత్రమైన గజరాజుపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్లు మధు, చంద్రశేఖర్, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు గణేష్, సుభాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్



తిరుచానూరు, జూలై 21: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం రాత్రి హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్‌నాయుడు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి తరువాత అమ్మవారి మూలవర్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు వేదాశీస్సులు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.25 కోట్లు

తిరుమల, జూలై21(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.25 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.25 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 83,538 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 30,267 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల,జూలై21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రేమ్‌వర్మ, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

జర్నలిస్ట్ సుధాకర్‌రెడ్డికి జాతీయ అవార్డు ప్రదానం పట్ల హర్షం



తిరుపతి అర్బన్, జూలై 21: సీనియర్ జర్నలిస్టు డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డికి జాతీయ ఉత్తమ అకడమిక్ కౌన్సెలర్ అవార్డు రావడం పట్ల పీఆర్‌ఎస్‌ఐ తిరుపతి చాప్టర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సి.రమాకాంత్‌శర్మ, ప్రస్తుత చైర్మన్ కె.శ్రీనివాసరావు, కార్యదర్శి డి.చంద్రమోహన్, ట్రెజరర్ ఆచార్య చక్రవర్తి రాఘవన్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డికి పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్‌ఐ) హైదరాబాదు శాఖ జాతీయ ఉత్తమ అకడమిక్ కౌన్సెలర్ అవార్డు ప్రకటించింది. వచ్చేనెల 6న హైదరాబాదులో జరిగే సమావేశంలో ప్రదానం చేయనున్నారు.

టీడీపీ నేత కారుకు నిప్పు

● పుంగనూరులో అర్ధరాత్రి దుండగుల దుశ్చర్య



పుంగనూరు, జూలై 21: పుంగనూరులోని తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకుడు ఎస్.నదీమ్‌కు చెందిన కారుకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. రామ్‌నగర్ శివార్లలోని తన ఇంటి పక్కన షెడ్డులో కారు ఉంచారు. దుండగులు ఈ చర్యకు పాల్పడ్డారు. షెడ్డులో నుంచి మంటలు వస్తుండటంతో పక్కన వారు గుర్తించి నదీమ్‌కు సమాచారం ఇచ్చారు. అందరూ కలిసి మంటలను ఆర్పేశారు.

నిలకడగా నిమ్మ ధరలు



గూడూరు అర్బన్, జూలై 21: గూడూరు నిమ్మ మార్కెట్‌లో నిమ్మ ధరలు నిలకడగా కొన సాగుతున్నాయి. ఆది వారం కిలో నిమ్మకాయలు రూ.80 పలకడంతో రైతు ల్లో సంతోషం వ్యక్తం అవు తోంది. అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ ధరలు నిలకడగా కొనసా గుతున్నాయి. గత ఏడాది ఈ సమయంలో ధరలు పడిపోయాయి. అయితే ఈసారి మాత్రం ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవు తోంది. 50 కిలోల టిక్కీ రూ.4 వేలు, 80 కిలోల లూజు బస్తా రూ.6,400, పొడి, సన్నకాయలు టిక్కీ బస్తా రూ.2 వేలు పలికాయి.

వైసీపీ కార్యకర్తలూ జాగ్రత్త !

మీ పార్టీ నాయకుల నుంచే పొంచివున్న మృత్యువు

టీడీపీ నేత ఓవీ రమణ



తిరుపతి అర్బన్, జూలై 21: వైసీపీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి.. సొంత పార్టీ నాయకుల నుంచే మృత్యువు పొంచి ఉంది.. అంటూ టీడీపీ సీనియర్ నేత ఓవీ రమణ అప్రమత్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తానే హత్యలు చేయించి టీడీపీపై నిందలు వేసేందుకు మాజీ సీఎం జగన్ సిద్ధమయ్యారని, గతంలోనూ ఇదే తరహాలో సానుభూతి పొందారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే హత్యారాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో రాజధాని, ఇసుక, లిక్కర్, ఆర్థిక వ్యవస్థలపై జగన్ మాట్లాడలేరని, చంద్రబాబును నిలదీయలేరని ఆయన స్పష్టం చేశారు. మీ సమావేశాలకు సొంతపార్టీ ఎంపీలే హాజరుకావడం లేదు.. ఢిల్లీకెళ్లి ఏంచేస్తారని, రాష్ట్రపతి పాలన విధించాలనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్‌కే ఝలక్ ఇచ్చిన విజయసాయిరెడ్డి ఇతరుల విషయంలో ఏమైనా చేయగల సమర్థుడని స్పష్టం చేశారు. నైతిక విలువలు లేని వ్యక్తి దేవుడి గురించి మాట్లాడడం సరికాదన్నారు. వ్యక్తిగతంగా తేల్చుకోవాలని, అడ్డమైన పనులకు దేవుడిపై ప్రమాణం చేయడం దారుణమన్నారు. మీడియాపై విరుచుకుపడటం అంతకంటే దురదృష్టకరం మరొక్కటి లేన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు వేసింది గంజాయిని ప్రోత్సాహించేందుకేనని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్ వ్యాపార రంగానికి అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నానన్నారు.



గురుపూర్ణమి సందర్భంగా తిరుపతి ఖాదీకాలనీలో సాయిబాబా విగ్రహానికి అభిషేకం - రాఘవేంద్రనగర్‌లో సాయిబాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు - టీకే వీధిలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

గురువే మార్గదర్శి



స్వామి సుకృతానంద

తిరుపతి (కల్చరల్), జూలై 21: మోక్షసాధనలో ఎవరికైనా గురువే మార్గదర్శిగా వ్యవహరిస్తారని స్వామి సుకృతానంద ఉద్బోధించారు. ఆదివారం గురుపూజోత్సవం వేడుక తిరుపతిలోని రామకృష్ణ ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 11.45 గంటలకు జరిగిన సభలో భగవంతుడిని చూపే వాడే గురువు అన్న అంశంపై స్వామిజీ ప్రసంగించారు. అంతకు ముందు ఉదయం 5 గంటల నుంచి ఆశ్రమంలోని శ్రీరామకృష్ణ ఆలయంలో ధ్యానం, విశేషపూజ, విష్ణు సహస్రనామ సంకీర్తన, హోమం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు సంధ్యాహారతి, సంకీర్తనా గానం నిర్వహించారు. ఆశ్రమంలోని స్వామీజీలు, నగర ప్రముఖులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న సుధారెడ్డి

మంగళంలో..

మంగళం, జూలై 21: మంగళం పరిధిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురు పూర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబా విగ్రహానికి అభిషేకాలు చేసి పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి, ఈఎస్‌ఐ డైరెక్టర్ రాధాకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీధర్, డాక్టర్ పూర్ణచంద్రరావు, సెంట్రల్ బోర్డు సభ్యులు లేబూరి రత్నకుమార్, టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు ఈశ్వరయ్య, మహేశ్వరి, గోపీనాథ్, ఆలయ కమిటీ సభ్యులు తేజ, సురేఖ, బుజ్జమ్మ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

అడిగోపులకు సాహితీకారుల నివాళి



తిరుపతి (కల్చరల్), జూలై 21: శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ అభ్యుదయ కవి అడిగోపుల వెంకటరత్నం భౌతిక కాయానికి తిరుపతిలోని పలువురు సాహితీవేత్తలు, సాహితీప్రియులు ఆదివారం ఉదయం ఎన్‌జీవో కాలనీలోని స్వగృహంలో ఘననివాళి అర్పించారు. అనంతరం వెంకటరత్నం పార్థివ దేహాన్ని స్వగ్రామమైన నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్తవంగల్లుకు తరలించిన కుటుంబ సభ్యులు అక్కడే అంత్యక్రియలు పూర్తిచేశారు. వెంకటరత్నంకు నివాళి అర్పించిన వారిలో అరసం రాష్ట్రనేత సాకం నాగరాజు, ఆంధ్రజ్యోతి సీనియర్ పాత్రికేయులు ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, తిరుపతి జిల్లా రచయితల సంఘం సభ్యులు ఆర్‌సీకే రాజు, కొత్వాలు అమరేంద్ర, వి.షణ్ముగం, తెలుగు భాషోద్యమ సమితి ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లేశ్వరరావు, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, సీపీఎం వందవాసి నాగరాజు తదితరులు ఉన్నారు.

చంద్రబాబును కలిసిన కుమారమ్మ



తిరుపతి (జీవకోన), జూలై 21: ముఖ్యమంత్రి చంద్రబాబును తిరుపతి జీవకోనకు చెందిన తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి కుమారమ్మ విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు తిరుమల శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

గంగమ్మ ఆలయంలో చండీహోమం



ప్రత్యేకాలంకారంలో గంగమ్మ

తిరుపతి (కల్చరల్), జూలై 21: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆదివారం మహాచండీహోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8.45 గంటల నుండి 11.45 గంటల వరకు జరిగిన హోమం పూర్ణాహుతితో ముగిసింది. ఆలయ అర్చకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సంస్కృతవర్సిటీలో ఘనంగా గురుపూర్ణమి



వ్యాసమహర్షి విగ్రహానికి పూజ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతిరూరల్, జూలై 21: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో గురుపూర్ణమిని పురస్కరించుకుని ఆదివారం గురు పూజోత్సవాన్ని నిర్వహించారు. వర్సిటీలోని వ్యాసమహర్షి విగ్రహానికి అధ్యాపకులు, విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష, డిప్యూటీ రిజిస్ట్రార్ వైవీ కృష్ణారావు, డాక్టర్ అవధాని, డాక్టర్ కుమార్ బాగేవాడిమర్, డాక్టర్ మనోజ్‌షిండే, డాక్టర్ నాగరాజుభట్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాట్యాచార్య దంపతులకు సన్మానం



తిరుపతి(విద్య), జూలై 21: గురు పూర్ణిమ సందర్భంగా ప్రముఖ నాట్యాచార్య దంపతులు ధనశ్రీ, శ్రీనివాసులుకు ఘనంగా సన్మానం జరిగింది. స్థానిక భరత కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ తదితరులు నాట్యాచార్య దంపతులను ఘనంగా సత్కరించి, అభినందించారు. దశాబ్దాలకు పైగా కళామతల్లి సేవలో తరిస్తూ... తమ జీవితాన్ని కళలకే అంకితంచేసి అనేకమందిని కళాకారులుగా తీర్చిదిద్దిన శ్రీనివాస ధనశ్రీ దంపతులకు శ్రీవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే ఆరణికి అభినందన



శ్రీనివాసులును సన్మానిస్తున్న నేతలు

తిరుపతి (జీవకోన), జూలై 21: స్థానిక జీవకోనలోని ఓ కల్యాణ మండపంలో నాడారు సంఘం 40వ వార్షికోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతి అసెంబ్లీ ఎన్నికల్లో నాడారు సంఘం సంపూర్ణ మద్దతు అందించి అఖండ మెజార్టీతో గెలిపించారన్నారు. వారికి రుణపడి ఉంటానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ నాడారు క్రమశిక్షణకు మారుపేరన్నారు. బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చాలా సంవత్సరాల క్రితం తమిళనాడు నుంచి వచ్చి తిరుపతిలో స్థిరపడి స్వశక్తితో తమ వ్యాపారాలను విస్తరించుకుని నాడారు సంఘం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. శివస్వామి నాడారు, నాయకులు అన్నా అనితా యాదవ్, మల్లీశ్వరి, అత్తలూరి భాను, కృష్ణకాంత్, వంశీ, జిలానీ, నాడార్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేయండి : సీపీఎం



సమావేశంలో ప్రసంగిస్తున్న రమేష్

తిరుపతి(ఆటోనగర్), జూలై 21: అధికారంలో వున్న కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు పట్టువదలకుండా పోరాడాలని సీపీఎం రాష్ట్ర నాయకులు ఎం.రమేష్, డి.సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షతన పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. ఎంపీలు మోదీ వద్ద గులాంగిరి చేయకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం కార్మిక, కర్షకులతోపాటు, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించడంతో దారుణ ఓటమికి గురైందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా గడవక ముందే అంగన్‌వాడీ, ఆశ వర్కర్లపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రతి పక్షపార్టీల నాయకులపై దౌర్జన్యాలు, దాడులు, హత్యలకు పాల్పడటం, తప్పుడు కేసులు బనాయించడం లాంటి చర్యలను ప్రభుత్వం ప్రోత్సహించొద్దని సూచించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని వెల్లడించారు. సెప్టెంబరు నుంచి మండల, నగర, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందారపు మురళి.. స్కీం వర్కర్లపై జరుగుతున్న రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సమావేశంలో నాయకులు పుల్లయ్య, జనార్ధన్ ప్రసంగించారు.

నేడు రిలీవ్‌కానున్న పొరుగు జిల్లాల తహసీల్దార్లు

డీటీలకు బాధ్యతల అప్పగింత

తిరుపతి(కలెక్టరేట్), జూలై 21: ఎన్నికల నేపథ్యంలో రాయలసీమ జిల్లాలతో పాటు గుంటూరు, ప్రకాశం నుంచి సుమారు 40మంది తహసీల్దార్లు మన జిల్లాకు వచ్చారు. ఎన్నికల నిర్వహణ పూర్తవడంతో తిరిగి తహసీల్దార్లను సొంత జిల్లాలకు పంపాలని రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం సీసీఎల్ఏను ఆదేశించింది. ఈ నేపథ్యంలో పొరుగు జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు సోమవారం మధ్యాహ్నం తర్వాత రిలీవ్ అయి మండలంలోని డిప్యూటీ తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. బయట జిల్లాల్లో ఉన్న 42మంది తిరుపతి జిల్లా తహసీల్దార్లు రెండురోజుల్లో కలెక్టరేట్‌లో రిపోర్టు చేసుకోనున్నారు. ఇప్పటికే పలువురు తహసీల్దార్ల పేర్లను తమ నియోజకవర్గంలోని మండలాల్లో నియమించాలని రాజకీయ నేతలు జిల్లా అధికారులు లేఖలు ఇచ్చినట్లు తెలిసింది.

లెజెండరీ, నంది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూలై 21: 2024 సంవత్సరానికి లెజెండరీ, నంది పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సరోజనమ్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామ రాజు స్మారక దినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రంగాల్లోని ప్రతిభావంతులు, విశేష సేవలందిస్తున్న ప్రముఖులను గుర్తించి వచ్చేనెల 10న హైదరాబాదులోని రవీంద్రభారతీలో లెజెండరీ, నంది పురస్కారాలు ప్రదానం చేసి సత్కరిస్తామన్నారు. సంగీత, నృత్య, చిత్రలేఖనం, అలంకరణ, ఇంద్రజాలం, క్రీడలు, నటన, విద్య, వైద్యం, వాస్తు, జాతకాలు, సామాజికసేవలు, సాహిత్య, జానపద రంగాలకు చెందిన వారితో పాటు కవులు, కళాకారులు, దర్శక, నిర్మాతలు, రంగస్థల కళాకారులు, గాయనీ గాయకులు, సంగీత, నృత్య కళాకారులు, న్యాయవాదులు, ఫ్యాషన్ డిజైనింగ్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఇతర రంగాల్లో తమ పూర్తి వివరాలతో ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 63029 08528, 97053 13061 నెంబర్లకు వాట్సాప్ చేయాలని కోరారు.

చిత్రపటం ఆవిష్కరణ



చిత్రపటం ఆవిష్కరిస్తున్న భువన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జూలై 21: తిరుపతి రూరల్ మండలం తనపల్లి కొండపై వెలసిన జ్ఞాన దండ యుద్ధ పాణి స్వామి చిత్రపటాన్ని తిరుపతి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం గురువులైన పద్మగిరి దిగంబరస్వామి, పద్మగిరి అనంత గురుకుల స్వామి సమాధులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు షణ్ముఖ సుందర్ గురుకుల్ పాల్గొన్నారు.

అదితి సింగ్‌కు ఘనంగా వీడ్కోలు



తిరుపతి(ఉపాధ్యాయ నగర్), జూలై 21: నగర పాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్‌కు ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆమె జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతి పొంది కడపకు బదిలీ అయిన సందర్భంగా ఆదివారం మున్సిపల్ సమావేశ మందిరంలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు అదితి సింగ్‌ను ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ... ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అంతా తనకు ఎంతో సహకరించారంటూ అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, స్మార్ట్‌సిటీ జీఎం చంద్రమౌళి, హెల్త్ ఆఫీసర్ అన్వేష్‌రెడ్డి, సెక్రటరీ రాధిక, డీసీపీ శ్రీనివాసులు, మేనేజర్ చిట్టిబాబు, డీఈలు, శానిటరీ సూపర్‌వైజర్లు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు

అటవీ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

అక్రమ కట్టడాలు కూల్చేయాలి - హేతువాద సంఘం డిమాండ్



మాట్లాడుతున్న ఎన్వీ సుబ్బయ్య

తిరుపతి(ఆటోనగర్), జూలై 21: అంజూరు రిజర్వు ఫారెస్ట్‌లో కల్కి ట్రస్ట్ నిర్వాహకులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను అధికారులు వెంటనే తొలగించాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీ సుబ్బయ్య, డాక్టర్ ఎఆర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. బీఎన్ కండ్రిగ కలివేటు గ్రామ లెక్కదాఖలా సర్వేనెంబరు 295 అంజూరు గ్రామ సమీపంలోని అటవీశాఖ పరిధిలో వున్న 20.75 ఎకరాల భూమిలో కల్కి ట్రస్ట్ నిర్వాహకులు అక్రమంగా కట్టడాలు కడుతున్నారని, వాటిని తొలగించాలని రెవెన్యూ అధికారులను కోరినా నేటివరకు స్పందించలేదని ఆరోపించారు. ఇటీవల ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అటవీ భూముల ఆక్రమణలకు అడ్డు కట్టవేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే.. రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని చెప్పారు. అలాగే వరదయ్యపాళెం వద్ద కల్కి ట్రస్ట్ నిర్వాహకులు ఆక్రమించుకున్న నాలుగు ఎకరాల దళితుల భూములను, దళితులకే అప్పగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా అప్పగించక పోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి అటవీ భూములను కాపాడి, కల్కిట్రస్ట్ భూబాధితులైన దళితులకు భూములు అప్పగించాలని వారు కోరారు. ఈ సమావేశంలో బాధితులు చంద్రశేఖర్, పోలయ్య, రాజయ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను అరికట్టాలి

- పీడీఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థినుల ప్రదర్శన



తిరుపతి(విద్య), జూలై 21: బాలలు, యువతలో నేర ప్రవృత్తికి కారణమవుతున్న మద్యం, మత్తు పదార్థాలను అరికట్టాలని కోరుతూ పీడీఎస్ఓ ఆధ్వర్యంలో తిరుపతి బాలికల వసతిగృహం విద్యార్థినులు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. పీడీఎస్ఓ జిల్లా కార్యదర్శి ఆర్.ఆష, స్రవంతి మాట్లాడుతూ... రాష్ట్రంలో నేరాలకు పాల్పడుతున్నవారిలో అత్యధికంగా మద్యం, మత్తు పదార్థాలకు బానిసలైన మైనర్లు, యువత ఉంటున్నారన్నారు. వారిలో నేర ప్రవృత్తి పెరగకుండా తీసుకోవాల్సిన అన్నిచర్యలపై ప్రభుత్వాలు దృష్టిపెట్టాలని, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు మాధవి, గాయత్రి తదితర విద్యార్థినులు పాల్గొన్నారు.

సైకాలజీతో ఉన్నత భవిష్యత్తు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 21: సైకాలజీ చదువుకున్న వారికి ఉన్నత ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు. దూరవిద్య సైకాలజీ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆదివారం వారు పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీలో సైకాలజీ కోర్సుకు మంచి డిమాండ్ ఉందన్నారు. దూరవిద్య ద్వారానూ అనేక మంది విద్యార్థులు సైకాలజీ కోర్సులో చేరుతున్నారని తెలిపారు. సైకాలజీ విభాగ అభివృద్ధికి యూనివర్సిటీ తరపున అన్ని విధాలుగా తోడ్పడతామన్నారు. జీవన శైలిలో మార్పులకూ, మానసిక రుగ్మతల నిర్మూలనకు సైకాలజీ విద్యార్థులు కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్యే నానీని కలిసిన ఎస్వీయూ రిజిస్ట్రార్



ఎమ్మెల్యే నానీతో భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 21: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీని తిరుపతిలోని ఆయన నివాసంలో ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. యూనివర్సిటీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా నానీని రిజిస్ట్రార్ కోరారు. అనంతరం శాలువా, పుష్ప గుచ్ఛం, జ్ఞాపికతో నానీని రిజిస్ట్రార్ సన్మానించారు.


బడ్జెట్‌లో ఉద్యోగులకు ప్రాధాన్యమివ్వాలి : ఆపస్

తిరుపతి(విద్య), జూలై 21: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించనున్న బడ్జెట్‌లో ఉద్యోగులకు ప్రాధాన్యమిచ్చి తగినవిధంగా కేటాయింపులు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. సోమవారం నుంచి జరిగే రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్ ప్రకటించే క్రమంలో ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మధ్యంతర భృతి, కరువు భృతి చెల్లించాలని కోరారు.





నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణులు - నచికేత ఆధ్యాత్మిక నాటకం



ఆకాంక్ష సాంఘిక నాటిక



అనూహ్యం సాంఘిక నాటిక

అలరించిన నాటికలు

తిరుపతి (కల్చరల్), జూలై 21: వర్తమాన సమాజంలోని విషయాలను చక్కగా ప్రదర్శించిన రెండు నాటికలు ప్రేక్షకులను అలరించాయి. అభినయ ఆర్ట్స్ వారి 24వ వార్షికోత్సవం సందర్భంగా మహతి ఆడిటోరియంలో భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, కొత్త ఢిల్లీ, ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ, అమరావతి, టీటీడీ సంయుక్త నిర్వహణలో హనుమ అవార్డ్స్ పోటీలలో భాగంగా రెండవ రోజు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ నృత్య పోటీలు జరిగాయి. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు యువ కళాకారులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు రసరంజని, హైదరాబాదు వారినచికేత ఆధ్యాత్మిక నాటకం, సాయంత్రం 6.30 గంటలకు శ్రీగరికపాటి రాజారావు కళా నికేతన్, ఏలేశ్వరం, కాకినాడ వారి ఆకాంక్ష సాంఘిక నాటిక ప్రదర్శించారు. రాత్రి 8 గంటలకు జరిగిన నటీనట సంక్షేమ సమాఖ్య, పాలకొల్లు వారి అనూహ్యం సాంఘిక నాటిక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది.

నేటి కార్యక్రమాలు: నేడు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నృత్యపోటీలు జరుగుతాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు శ్రీవాసవి కళాపరిషత్, ఖమ్మం వారి శ్రీమతి కల్యాణం పద్య నాటకం ఉంటుంది. సాయంత్రం 7 గంటలకు అభ్యుదయ ఆర్ట్స్ విజయవాడ వారి నాలోన నీవే సాంఘిక నాటిక ప్రదర్శితమౌతుంది.



ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, D. ASHRAFUNNISA W/o Ashraf Alee Mohammed R/o 12-314, Bugga Street, Renigunta, Tirupathi Dt., A.P. Have changed My Husband Name From ASHRAF ALEE MOHAMMED to D.MD.ASHRAF ALI (New Name)
AJT - 4144

CHANGE OF NAME
I, MOHAMMED ASHRAF ALEE S/o D. Abdulla (Old Name) R/o 12-314, Bugga Street, Renigunta, Tirupathi Dt, A.P. Have changed My Name to D. MD. ASHRAF ALI (New Name)
AJT - 4133

WANTED
Wanted certified AYUSH therapist (Ayurveda / Siddha/Ayush therapist) Male 2 Posts, Female 2 posts. Salary 20,000 per Month, Age limit 27years. contact : 86860 88616, 77940 33341
AJT - 187461

WANTED
తిరుపతిలో ప్రముఖ హోటల్ నందు పని చేయుటకు, టిఫిన్ మాస్టర్స్, టీ మాస్టర్స్, జ్యూస్ మాస్టర్స్, సప్లయర్స్, క్లీనింగ్ స్టాఫ్ కావలెను సం.ప్ర. సెల్: 70937 35578, 91005 93958
AJT-4132

TAX CONSULTANTS
File Income Tax Returns, GST, Company Registration, ROC Fillings, Website Design, Business Registration, Vehicle Insurance, Digital Marketing at Low Prices, Call or Whatsapp 7207446677
AJT - 187457

REALESTATE
తిరుపతి ప్రతి ఏరియాలో పీకు ఓపెన్ ప్లాట్స్, ల్యాండ్స్ కమర్షియల్ ప్లాట్స్ కొని ఇవ్వబడును & మీ ప్లాట్స్ అమ్మించబడును తొండవాడ, చెర్లోపల్లి, మల్లంగుంట, తనపల్లి, తిరుచానూరు, రేణిగుంట ఎయిర్‌పోర్టు మంగళం : 81796 68069.
AJT - 4128

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(లైసెన్స్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647
AJA- 189281

కావలెను
తిరుపతి శ్రీ గోపి కృష్ణ ఆయిల్ ట్రేడర్స్ నందు పనిచేయుటకు ప్యాకింగ్ యూనిట్ వర్కర్స్ (స్త్రీలు / పురుషులు) కావలెను. అకౌంట్స్ మేనేజర్ (Tally) కావలెను. సం॥ వేదాంత అగ్రహారం, తిరుపతి. సెల్: 93939 22999
AJT-187369

క్లాసిఫైడ్

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

గంజాయి మత్తులో దారుణాలు

● తాజాగా జరిగిన రెండు ఘటనలే నిదర్శనం

● రాత్రి గస్తీలు, బీట్‌లు కొరవడటమే

కారణమంటున్న మహిళా సంఘాలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 21: గంజాయి మత్తులో దారుణాలు జరుగుతున్నాయి. జిల్లాలో దొరవారిసత్రం, తిరుపతి రాయల్‌నగర్ ప్రాంతాల్లో తాజాగా జరిగిన రెండు ఘటనలే దీనికి నిదర్శనం. ఈ వరుస సంఘటనలతో బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోతోందని మహిళా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ● దొరవారిసత్రం మండలంలో వలస వచ్చిన బిహార్‌కి చెందిన కొన్ని కుటుంబాలు గ్రామంలోని ఒక రైసు మిల్లులో పనిచేస్తున్నాయి. అందులో పనిచేస్తున్న ఓ దంపతుల ఎనిమిదేళ్ల కుమార్తెపై బుధవారం గంజాయి మత్తులో ఉన్న బిహార్ రాష్ట్రంలోని బెహారి ప్రాంతానికి చెందిన దిలీప్‌కుమార్ సదా (20) అత్యాచారం చేశాడు. ఆపై హత్య చేశాడు. ● తిరుపతి రాయల్‌నగర్‌లో గురువారం సాయంత్రం మరో ఘోరం జరిగింది. గంజాయి మత్తులో ఉన్మాదిగా మారిన శ్రీనివాసులు పాత గొడవలు మనసులో పెట్టుకుని ఓ వృద్ధురాలిని కత్తితో గొంతు కోసి దారుణంగా చంపేశాడు. ఆమె ఇద్దరు మనవరాళ్లపైనా దాడి చేశాడు.

మహిళా సంఘాల ఆందోళన

జిల్లాలో రాత్రి గస్తీలు, బీట్‌లు కొరవడటం వల్లే ఇటువంటి దారుణాలు జరుగుతున్నాయని మహిళా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డైనమిక్ బీట్‌లైతే అడ్రస్ లేవు. ఐదేళ్ల కిందటి వరకు ప్రధాన వీధులు, పట్టణాల్లో రాత్రి బీట్ పోలీసులు సైరన్ వేసుకుని రావడం, విజిల్ వేస్తూ.. లాఠీతో రోడ్లపై కొడుతూ వెళ్లేవారు. కొన్ని ఇళ్ల వద్ద బీట్‌ల బుక్ పెట్టి పోలీసులు వచ్చినట్లు సంతకాలు చేసేవారు. ఇవన్నీ ప్రస్తుతం అటకెక్కడంతో జులాయిల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది. ముఖ్యంగా గంజాయి విక్రయించేవారు, సేవించేవారు ఎక్కువవడంతో మరింత ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. దీనిపై ఎస్పీ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

అటవీ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

అక్రమ కట్టడాలు కూల్చేయాలి: హేతువాద సంఘం



మాట్లాడుతున్న ఎన్వీ సుబ్బయ్య

తిరుపతి (ఆటోనగర్), జూలై 21: అంజూరు రిజర్వు ఫారెస్ట్‌లో కల్కిట్రస్ట్ నిర్వాహకులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను అధికారులు వెంటనే తొలగించాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీ సుబ్బయ్య, డాక్టర్ ఎఆర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. బీఎన్ కండ్రిగ కలివేటు గ్రామ లెక్కదాఖలా సర్వేనెంబరు 295 అంజూరు గ్రామ సమీపంలోని అటవీశాఖ పరిధిలో వున్న 20.75 ఎకరాల భూమిలో కల్కి ట్రస్ట్ నిర్వాహకులు అక్రమంగా కట్టడాలు కడుతున్నారని, వాటిని తొలగించాలని రెవెన్యూ అధికారులను కోరినా నేటివరకు స్పందించలేదని ఆరోపించారు. ఇటీవల ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అటవీ భూముల ఆక్రమణలకు అడ్డు కట్టవేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే.. రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని చెప్పారు. అలాగే వరదయ్యపాళెం వద్ద కల్కి ట్రస్ట్ నిర్వాహకులు ఆక్రమించుకున్న నాలుగు ఎకరాల దళితుల భూములను, దళితులకే అప్పగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా అప్పగించక పోవడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి అటవీ భూములను కాపాడి, కల్కిట్రస్ట్ భూబాధితులైన దళితులకు భూములు అప్పగించాలని వారు కోరారు. ఈ సమావేశంలో బాధితులు చంద్రశేఖర్, పోలయ్య, రాజయ్య పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలూ జాగ్రత్త !

● మీ పార్టీ నాయకుల నుంచే పొంచివున్న మృత్యువు

● టీడీపీ నేత ఓవీ రమణ



తిరుపతి అర్బన్, జూలై 21: వైసీపీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి.. సొంత పార్టీ నాయకుల నుంచే మృత్యువు పొంచి ఉంది.. అంటూ టీడీపీ సీనియర్ నేత ఓవీ రమణ అప్రమత్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తానే హత్యలు చేయించి టీడీపీపై నిందలు వేసేందుకు మాజీ సీఎం జగన్ సిద్ధమయ్యారని, గతంలోనూ ఇదే తరహాలో సానుభూతి పొందారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే హత్యారాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో రాజధాని, ఇసుక, లిక్కర్, ఆర్థిక వ్యవస్థలపై జగన్ మాట్లాడలేరని, చంద్రబాబును నిలదీయలేరని ఆయన స్పష్టం చేశారు. మీ సమావేశాలకు సొంత పార్టీ ఎంపీలే హాజరుకావడం లేదు.. ఢిల్లీకెళ్లి ఏంచేస్తారని, రాష్ట్రపతి పాలన విధించాలనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్‌కే ఝలక్ ఇచ్చిన విజయసాయిరెడ్డి ఇతరుల విషయంలో ఏమైనా చేయగల సమర్థుడని స్పష్టం చేశారు. నైతిక విలువలు లేని వ్యక్తి దేవుడి గురించి మాట్లాడడం సరికాదన్నారు. వ్యక్తిగతంగా తేల్చుకోవాలని, అడ్డమైన పనులకు దేవుడిపై ప్రమాణం చేయడం దారుణమన్నారు. మీడియాపై విరుచుకుపడటం అంతకంటే దురదృష్టకరం మరొక్కటి లేన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు వేసింది గంజాయిని ప్రోత్సాహించేందుకేనని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్ వ్యాపార రంగానికి అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నానన్నారు.

నేడు రిలీవ్‌కానున్న పొరుగు జిల్లాల తహసీల్దార్లు

డీటీలకు బాధ్యతల అప్పగింత

తిరుపతి(కలెక్టరేట్), జూలై 21: ఎన్నికల నేపథ్యంలో రాయలసీమ జిల్లాలతోపాటు గుంటూరు, ప్రకాశం నుంచి సుమారు 40మంది తహసీల్దార్లు మన జిల్లాకు వచ్చారు. ఎన్నికల నిర్వహణ పూర్తవడంతో తిరిగి తహసీల్దార్లను సొంత జిల్లాలకు పంపాలని రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం సీసీఎల్‌ఏను ఆదేశించింది. ఈ నేపథ్యంలో పొరుగు జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు సోమవారం మధ్యాహ్నం తర్వాత రిలీవ్ అయి మండలంలోని డిప్యూటీ తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. బయట జిల్లాల్లో ఉన్న 42మంది తిరుపతి జిల్లా తహసీల్దార్లు రెండురోజుల్లో కలెక్టరేట్‌లో రిపోర్టు చేసుకోనున్నారు. ఇప్పటికే పలువురు తహసీల్దార్ల పేర్లను తమ నియోజకవర్గంలోని మండలాల్లో నియమించాలని రాజకీయ నేతలు జిల్లా అధికారులు లేఖలు ఇచ్చినట్లు తెలిసింది.

రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేయండి: సీపీఎం



సమావేశంలో ప్రసంగిస్తున్న రమేష్

తిరుపతి(ఆటోనగర్), జూలై 21: అధికారంలో వున్న కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు పట్టువదలకుండా పోరాడాలని సీపీఎం రాష్ట్ర నాయకులు ఎం.రమేష్, డి.సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షతన పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. ఎంపీలు మోదీ వద్ద గులాంగిరి చేయకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం కార్మిక, కర్షకులతోపాటు, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించడంతో దారుణ ఓటమికి గురైందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా గడవక ముందే అంగన్‌వాడీ, ఆశ వర్కర్లపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రతి పక్షపార్టీల నాయకులపై దౌర్జన్యాలు, దాడులు, హత్యలకు పాల్పడటం, తప్పుడు కేసులు బనాయించడం లాంటి చర్యలను ప్రభుత్వం ప్రోత్సహించొద్దని సూచించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని వెల్లడించారు. సెప్టెంబరు నుంచి మండల, నగర, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందారపు మురళి.. స్కీం వర్కర్లపై జరుగుతున్న రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సమావేశంలో నాయకులు పుల్లయ్య, జనార్ధన్ ప్రసంగించారు.

గుర్రపుడెక్క తొలగించేది ఎప్పుడో?



గుర్రపుడెక్కతో నిండిపోయిన చల్లకాలువ - చెట్లతో కమ్ముకుపోయిన నాయుడు కాలువ - గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలతో నిండిన దూడల కాలువ

గూడూరు, జూలై 21: వర్షాకాలంలో వరద నీరు పట్టణాన్ని చుట్టుముట్టకుండా సజావుగా కండలేరు క్రీక్‌లో కలసే పలు కాలువలు నేడు దుస్థితికి చేరుకున్నాయి. ప్రధాన కాలువ గుర్రపుడెక్కతో, కలుపు మొక్కలతో, చెట్లతో చిట్టడివిని తలపిస్తోంది. దీంతో వర్షపు నీరు సక్రమంగా పారకుండా ఎక్కడ పట్టణాన్ని ముంచెత్తుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో, తుఫానుల సమయంలో నీరు పట్టణాన్ని చుట్టుముట్టకుండా ఉండేలా చల్లకాలువ, దూడలకాలువ, పంబలేరు కాలువలు ఉన్నాయి. వర్షాలు అధికంగా కురిసిన సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి, చెరువుల నుంచి వచ్చే నీరు చల్లకాలువ, దూడల కాలువ, పంబలేరు కాలువల మీదుగా పురిటిపాళెం సమీపంలోని జాతీయ రహదారి వద్ద ప్రవహిస్తున్న పంబలేరు వాగులో కలిసి కండలేరు క్రీక్ ద్వారా సముద్రంలో కలిసిపోతాయి. రాపూరు సహా ఎగువ ప్రాంతంలో నుంచి వర్షపునీరు గూడూరు మండలంలోని విందూరులో ఉన్న పంబలేరు కాలువ ద్వారా పంబలేరువాగులోకి, వెంకటగిరి, చెన్నూరు సహా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు మర్రిపల్లిమడుగు, రావి చెరువు నుంచి చల్లకాలువ ద్వారా, గూడూరు చెరువు నిండిపోతే కలుజులనుంచి దూడల కాలువ ద్వారా పంబలేరువాగులో కలిసిపోతాయి. అయితే వర్షాకాలం సమీస్తున్న తరుణంలో ఈ కాలువలు గుర్రపుడెక్కతో నిండిపోయి ప్రవాహాన్ని అడ్డుకునేలా మారాయి. రావి చెరువు నుంచి వరదనీరు నాయుడుకాలువ ద్వారా గూడూరు చెరువుకు చేరుతుంది. ఈ నాయుడుకాలువ సైతం పిచ్చి చెట్లు మొలిచిపోయి నీటి ప్రవాహం సజావుగా సాగేందుకు అడ్డంకిగా మారింది. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలో భాగంగా ఈ కాలువల్లో పూడిక తీయడంతోపాటూ చెట్టుపుట్టా తొలగించాల్సి ఉంది. ఎప్పుడూ వరదలు వచ్చినా చల్లకాలువ, పంబలేరుకాలువ నుంచి వచ్చే వరదనీరు అదే వేగంతో ముందుకు ప్రవహించలేక పట్టణాన్ని ముంచేస్తున్నాయి. దీంతో స్థానిక జనార్దన రెడ్డి కాలనీ, దూర్జటి నగర్ తదితర లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యేవి. గూడూరుచెరువు నిండిన సమయంలో దూడలకాలువలో నీరు ముందుకు వెళ్లకపోవడంతో ఆర్టీసీబస్టాండు, విఘ్నేశ్వరపురం, వరదా నగర్ గిరిజన కాలనీ తదితర ప్రాంతాలు వరదనీటితో చిక్కుకుపోతాయి. యేటా ఇదే తంతూ జరుగుతున్నా గత వైసీపీ ప్రభుత్వం ముందస్తు నివారణ చర్యలకు చేపట్టలేదని స్థానికులు బాహాటంగానే చెబుతున్నారు. దీనికితోడు సంబంధిత శాఖ అధికారులు కూడా చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ప్రస్తుతం చల్లకాలువ, దూడలకాలువ గుర్రపుడెక్కతో, కలుపు మొక్కలతో, నాయుడుకాలువ చెట్లతో నిండిపోయి ఉండడంతో ఎక్కడ నీరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని కాలువల్లో పూడిక తీసి, గుర్రపుడెక్క తొలగించాలని గూడూరు పట్టణవాసులు కోరుతున్నారు.

జీఎన్‌టీ రోడ్డులో గుంతలు... పట్టించుకోని అధికారులు



సూళ్లూరుపేట, జూలై 21: పట్టణంలోని హోలిక్రాస్ కూడలి నుంచి తాజ్ పెట్రోల్ బంకు వరకు జీఎన్‌టీ రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. ఈ రోడ్డు మీదుగా నెల్లూరు, చెన్నై వైపు వెళ్లే వాహనాలతో పాటు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దాదాపు కిలోమీటరు పరిధిలో పెద్దపెద్ద గుంతలతో వాహన చోదకులకు ఇబ్బంది తప్పడం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీస మరమ్మతులు చేపట్టక పోవడంతో ప్రయాణించలేని పరిస్థితి. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలబడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకుని కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

నిలకడగా నిమ్మ ధరలు



గూడూరు అర్బన్, జూలై 21: గూడూరు నిమ్మ మార్కెట్‌లో నిమ్మ ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. ఆదివారం కిలో నిమ్మకాయలు రూ.80 పలకడంతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. గత ఏడాది ఈ సమయంలో ధరలు పడిపోయాయి. అయితే ఈసారి మాత్రం ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 50 కిలోల టిక్కీ రూ.4 వేలు, 80 కిలోల లూజు బస్తా రూ.6,400, పొడి, సన్నకాయలు టిక్కీ బస్తా రూ.2 వేలు పలికాయి.

శాస్త్రోక్తంగా మహా చండీయాగం



పూర్ణాహుతి పూజాసామగ్రితో కొండేపాటి గంగాప్రసాద్

సూళ్లూరుపేట, జూలై 21: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ ఆలయంలో ఆషాడ మాసం పౌర్ణమి సందర్భంగా ఆదివారం మహా చండీయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేద పండితుల మంత్రోచ్చరణల నడమ యాగాన్ని నిర్వహించారు. టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. యాగం పూర్తయిన అనంతరం పూర్ణహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు విజయశ్రీ, కురగొండ్ల రామకృష్ణ, సునీల్‌కుమార్, పెంచలకోన ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ తానంకి నానాజీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, టీడీపీ నేతలు టి.సుధాకర్ రెడ్డి, ఏ.రమేష్, ఏ.జీ.కిషోర్, జి.నారాయణ రెడ్డి, పెరుమాల్, బి.శ్రీధర్, సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు



గూడూరు పట్టణంలోని షిర్డీ ఆలయంలో సత్యవ్రతం - తడ పట్టణంలోని బాబా ఆలయంలో ప్రత్యేక అలంకరణ - ఓజిలిలో సాయినాథుడి గ్రామోత్సవం

గూడూరు, జూలై 21: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపూర్ణిమ వేడుకలను వైభవంగా నిర్వహించారు. బాబాను పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయి సత్యవ్రతం నిర్వహించిన అనంతరం పల్లకీసేవ చేపట్టారు.● చిల్లకూరులో మండలంలోని అంకులపాటూరు, బల్లవోలులో సాయిబాబా ఆలయాల్లో గురుపూర్ణిమ సందర్భంగా సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.● నాయుడుపేట పట్టణంలోని బ్రాహ్మణ వీధి, అగ్రహారపేటలోని షిర్డీ సాయిబాబా ఆలయాలలో వేకువజామునుంచే పాలాభిషేకాలు నిర్వహించారు. దీంతో భక్తులు పాలాభిషేకం కోసం క్యూలో బారులుతీరారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం కుంకుమార్చన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ● వెంకటగిరి టౌన్ పట్టణంలోని పలు ఆలయాల్లో గురుపూర్ణిమ వేడుకలు జరిగాయి. కుమ్మరిగుంట వద్ద ఉన్న సాయిబాబా ఆశ్రమంలో సాయినాథుడికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ● చిట్టమూరు, మల్లాం గ్రామంలోని సాయాబాబా మందిరాల్లో బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. బాబా భక్తి గీతాలను భక్త బృందాలు ఆలపించారు. ● ఓజిలితోపాటు మానమాల, కురుగొండ, ఆరిమేనిపాడు, అత్తివరం, ఇనుగుంట తదితర గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఓజిలి, మానమాల, కురుగొండ గ్రామాలలోని సాయిబాబా మందిరం వద్ద అన్నదానం కార్యక్రమాలను చేపట్టారు. అంతకుముందు సాయినాథుడి గ్రామోత్సవాలను నిర్వహించారు. ● కోట పట్టణంలోని బాబా ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు సారంగం విజయభాస్కర్ ఆధ్వర్యంలో సాయి సత్సంగాలు, భజనలు జరిగాయి. అదే విధంగా విద్యానగర్, కోట, తిమ్మానాయుడునగర్, తదితర గ్రామాల్లో గురుపౌర్ణమిని పురస్కరించుకొని భక్తులకు అన్నదానం చేశారు. ● సూళ్లూరుపేట పట్టణంలోని కేఆర్‌పాలెం సాయి సన్నిధి సత్సంగ మందిరంలో ఉదయం బాబాకు పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. మధ్నాహ్నం అన్నదానం చేశారు. రాత్రి చావడి ఉత్సవం వైభవంగా జరిగింది. ● తడ పట్టణంలోని సాయిబాబ ఆలయంలో నిప్పో కంపెనీ ఆధ్వర్యంలో మధ్నాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిప్పో కంపెనీ ఎండీ ద్వారక నాథ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఈబీలో విలీనం చేయండి

ఎమ్మెల్యే విజయశ్రీకి ఎనర్జీ అసిస్టెంట్ల వినతి



నాయుడుపేట, జూలై 21: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లుగా పని చేస్తున్న తమను ఏపీఎస్ఈబీలో విలీనం చేయాలని ఎమ్మెల్యే విజయశ్రీకి వినతిపత్రం అందజేశారు. 2019లో ప్రభుత్వం నిర్వహించిన ఎనర్జీ అసిస్టెంట్, జేఎల్ఎం గ్రేడ్-2లో రాష్ట్రవ్యాప్తంగా 7,329 మంది ఎంపికయ్యారని తెలిపారు. సచివాలయ సిబ్బందిగా ఉన్నప్పటికీ తాము ఏపీఎస్ఈబీలో విధులు నిర్వహిస్తున్నామని తమకు జీతాలను ఎలక్ట్రిసిటీ బోర్డు అందిస్తోందన్నారు. తమను సచివాలయ సిబ్బందిగా కాకుండా ఏపీఎస్ఈబీ రెగ్యులేషన్ ప్రకారం అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పదోన్నతి కల్పించాలన్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

దుస్థితిలో పెన్నక్క చెరువు కరకట్టలు



నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద ఉన్న పెన్నక్క చెరువు - కొత్తపాళెం వద్ద, పల్లమాల వద్ద కోతకు గురైన చెరువు కట్ట

కోట, జూలై 21: వేలాది ఎకరాల రైతుల వరప్రసాదిని పెన్నక్క చెరువు దుస్థితికి చేరుకుంటున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మిచౌంగ్ తుఫాన్ దెబ్బకు చెరువు కర కట్టలు కోతకు గురైనాయి. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఎక్కడ చెరువు తెగిపోతుందోనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. కోట, చిల్లకూరు మండలాల రైతుల కల్పతరువుగా పెన్నక్క చెరువు కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం నుంచి చిల్లకూరు మండలం పల్లమాల వద్ద ముగుస్తుంది. సుమారు 9 కిలోమీటర్ల మేర పొడవు ఉంటుంది. ఈ చెరువు కింద 9వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువు నీటి ఆధారంగా ఆయా భూములన్నీ వరి పుష్కలంగా పండుతుంది. నెల్లూరుపల్లి కొత్తపాళెం, పల్లమాల సమీపాలలో చెరువుకట్టలు కోతకు గురైనాయి. గత ఐదేళ్లలో కరకట్టలకు తాత్కలిక మరమ్మతులు చేపట్టలేదు. గండ్లు, కోతకు గురైన చోట రింగ్‌బండ్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ ఏడాది తుఫాన్లు ఎక్కువగా రానున్నట్లు ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో పెన్నక్క చెరువు ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. మరమ్మతులు చేపట్టకపోతే చెరువు కట్టలు తెగి నీరు నిలబడదని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పాలకులైనా స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కూరగాయల సాగుపై దృష్టి సారించండి



మహిళా రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న లక్ష్మీసాయి ప్రియ

వెంకటగిరి, జూలై 21: మహిళా రైతులు పెరటి తోటల సాగుపై దృష్టి సారించేలా కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు అవగాహన కల్పించాలని టీడీపీ నాయకురాలు కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. ఆదివారం కృషి విజ్ఞాన కేంద్రంలో కూరగాయల సాగుపై నిర్వహించిన శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గతంలో ఇంటి ఆవరణలో మహిళలు కూరగాయలు సాగు చేస్తుండే వారని, వాటితో ఇంటిల్లిపాదికీ అవే సరిపోయేవన్నారు. రానురాను బహిరంగ మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేస్తుండడంతో వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ఇంటి ఆవరణలోనే కాకుండా మేడలపై సేంద్రియ ఎరువులతో కూరగాయలు సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళా రైతులకు ఉచితంగా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు గోవిందరాజులు, తిరుపాల్, నాగార్జన రెడ్డి, రాజీవన, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుగు కేవీకే ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మకు బంగారు పూత వడ్డాణం వితరణ



సూళ్లూరుపేట, జూలై 21: చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి సూళ్లూరుపేటకు చెందిన సతీష్‌బాబు, సురేఖ దంపతులు ఆదివారం వడ్డాణాన్ని వితరణగా అందజేశారు. 198 గ్రాముల వెండికి 60 గ్రాముల బంగారు తాపడం చేసిన వడ్డాణాన్ని సహాయ కమిషనర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, పి.మురళిరెడ్డి, సుధా, టి.సుధాకర్ రెడ్డి, ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.25 కోట్లు

తిరుమల, జూలై21(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.25 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.25 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 83,538 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

గుర్రప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

డక్కిలి, జూలై 21 : మండలంలోని తిమ్మాయపాళెంలోని గుర్రప్ప స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ వద్ద పొంగళ్ళు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మోపూరులోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సూళ్లూరుపేట, జూలై 21: భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు సుంకర అల్లెయ్య అన్నారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణ రంగం కుదేలైందన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. సాంబశివయ్య, సుధాకర్ రావు, లక్ష్మయ్య, వేణు, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు



కోట, జూలై 21: కోట గ్రామ దేవత కోటమ్మకటి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయ మండలాల నుంచి భక్తులకు ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో తీర్థప్రసాద వినియోగం జరిగింది.



భీమ, దుర్యోధన పోరాట దృశ్యాలు

అలరించిన దుర్యోధన, దుశ్శాసన వధ

శ్రీకాళహస్తి, జూలై 21: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మారాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం జరిగిన దుర్యోధన, దుశ్శాసన వధ ఘట్టం ఆకట్టుకుంది. యుద్ధ ఘట్టం ముగిసిన తరువాత భక్తులు పొంగళ్లు పెట్టారు. ఇదిలా ఉండగా ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం తిరునాళ్ల సందడి నెలకొంది. స్థానికంగా ఉన్న భక్తులు కోలాటాలు, భజనలు, మరోవైపు పిల్లల కోసం కోసం ఏర్పాటు చేసిన ఉయ్యాళ్లు, ఇతర యంత్రాలు, బెలూన్‌లు వంటి దృశ్యాలు పిల్లలను ఎంతగానో అకట్టుకున్నాయి.



పొంగళ్లు పెడుతున్న భక్తులు

తారకరామనగర్‌లో కార్డెన్ సెర్చ్

తారకరామనగర్, జూలై 21: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో ఆదివారం ఉదయం డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ప్రతి ఇంటి వద్ద క్షుణ్ణంగా వివరాలు అడుగుతూ ఆధార్ కార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటోలు, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా రికార్డులు, లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. రికార్డులు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ మల్లికార్జున తెలిపారు. ఈ ప్రాంతంలో ఎవరైనా అనుమానితులు కలిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్ఐ జావీద్‌బాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్ఐలు

తాగునీటి సమస్య పరిష్కారం

కేవీబీపురం, జూలై 21: మండలంలోని కస్తూరిపురం గిరిజన కాలనీ వాసులు ఎన్నో ఏళ్లుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజులునాయుడు, తిరుపతి పార్లమెంటు రైతు అధ్యక్షుడు గోపీనాధ్‌రెడ్డి స్పందించి కాలనీలో ట్యాంకు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ముత్తుమారియమ్మకు ప్రత్యేక పూజలు

కేవీబీపురం, జూలై 21: మండల కేంద్రంలోని సంతమైదానం వద్ద వెలసిన ముత్తుమారియమ్మకు గురుపౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మేళతాళాల, భజనల నడుమ గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఆలయంలో బోరు డ్రిల్లింగ్

ఏర్పేడు, జూలై 21: ఏర్పేడు మండలం కుక్కలగుంటలో వెలసిన జలలింగేశ్వరస్వామి ఆలయంలో గుడిమల్లం గ్రామానికి చెందిన బత్తల ముని రత్నం నాయుడు, లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు బాబునాయుడు, గిరినాయుడు నూతనంగా బోరు డ్రిల్లింగ్ చేయించి మోటారు అమర్చారు. గ్రామస్తులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నిత్య జ్ఞానానందస్వామి, హేమసుందరం, పద్మనాభనాయుడు, రత్నంయాదవ్, సుధాకర్‌నాయుడు, సురేష్‌నాయుడు, రాజా, మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి పూజలు

పిచ్చాటూరు, జూలై 21: పిచ్చాటూరు మండలం రామగిరి గ్రామదేవత అంకాళపరమేశ్వరి ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. రామగిరికి చెందిన శివయ్య నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం అమ్మవారి మూల విరాట్‌కు పూజారులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ఊంజల్ మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి ఊంజల్‌సేవ నిర్వహించారు.

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేట, కర్నాలవీధి ప్రాంతాల్లో సాయినాధుని ఆలయాల్లో గురుపౌర్ణిమ వేడుకలు నిర్వహించారు. తెల్లవారు జామున ఆలయాలను పుష్పాలంకరణ, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. సాయినాధుడికి విశేష మహన్యాస రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు సాయినాధుని కీర్తిస్తూ భజనలు చేశారు. ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

సత్యవేడు, జూలై 21: మండలంలో సచివాలయాల పరిధిలో ఈనెల 23నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్ర శేఖర్ తెలిపారు. ఒక బృందం దాసుకుప్పం సచివాలయంలో 23 నుంచి 25 వరకు, శిరుణంబూదూరు సచివాలయంలో 26 నుంచి 27వరకు, మరో బృందం ఇరుగుళం సచివాలయంలో 23నుంచి 25 వరకు, చెరివి సచివాలయంలో 26 నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నాయని తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు, చిరునామా, ఫొటో మార్పు, మొబైల్ నంబరు అనుసంధానం, వేలి ముద్రల నమోదు చేయడం జరుగుతుందన్నారు.

రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

వరదయ్యపాళెం, జూలై 21: వరదయ్యపాళెం మండలం బత్తలవల్లంలో అనుమతి లేకుండా చేపట్టిన మట్టి తవ్వకాలపై పోలీసులు ఆదివారం దాడులు చేపట్టారు. ఏఎస్ఐ షణ్ముగం ఆధ్వర్యంలో పోలీసులు బత్తలవల్లం వద్ద మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లతో పాటు ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ షణ్ముగం హెచ్చరించారు.

డ్వాక్రా నగదు విషయమై దంపతుల మధ్య గొడవ భార్య ఆత్మహత్య

కేవీబీపురం, జూలై 21: డ్వాక్రా సంఘం డబ్బుల విషయమై దంపతుల మధ్య ఏర్పడిన మనస్పర్థలు భార్య ఆత్మహత్యకు దారితీశాయి. ఏఎస్ఐ లోకనాథం కథనం మేరకు... కేవీబీపురం మండలంలోని కళత్తూరు దళితవాడకు చెందిన సంధ్యారాణి(24), ఆమె భర్త బెనర్జీ డ్వాక్రా సంఘం డబ్బులు విషయమై గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన సంధ్యారాణి శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఘనంగా మాతమ్మ కొలుపు



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

సత్యవేడు, జూలై 21: మండలంలోని దాసుకుప్పంలో మాతమ్మ కొలుపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గత బుధవారం ప్రారంభమైన కొలుపు ఉత్సవాలు ఆదివారం అగ్నిగుండ ప్రవేశంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో భక్తులు కంకణాలను ధరించి, భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు.

భక్తులసేవే భగవంతుడి సేవ



అన్నదానం చేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి, జూలై 21: భక్తులసేవే భగవంతుని సేవ అని విజయ స్టీల్ అండ్ సిమెంట్ ఏజెన్సీస్ నిర్వాహకులు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో ఆదివారం అగ్నిగుండ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని ధర్మరాజస్వామి ఆలయానికి సమీపంలో వీఎంసీ కూడలి వద్ద ఉన్న విజయ స్టీల్ అండ్ సిమెంట్ ఏజెన్సీస్ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు విజయయాదవ్, బాలుయాదవ్, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల పండుగ

వరదయ్యపాళెం, జూలై 21: వరదయ్యపాళెం మండలం పెద్దపాండూరు పంచాయతీలో ఆదివారం పీర్లపండుగ జరిగింది. మొహర్రం వేడుకలను పురస్కరించుకుని చివరిరోజు కావడంతో పీర్లను బావిలో వేయడంతో ముగిసింది.





పోటెత్తిన కంకణధారులు - అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

శ్రీకాళహస్తి, జూలై 21: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవంగా అగ్నిగుండ ప్రవేశం జరిగింది. ఉదయం దుర్యోధన, దుశ్శాసన వధ ఘట్టం పూర్తయిన తరువాత ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో అగ్ని గుండానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అగ్గిని వెలిగించారు. సాయంత్రం ఆలయంలో ద్రౌపదీదేవికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి వాహనంపై అగ్నిగుండం వద్దకు తీసుకువచ్చారు. అగ్నిగుండం చుట్టూ అష్టదిక్పాలుర పూజ, నైవేద్యం సమర్పించి గుమ్మడికాయను దిష్టిగా నరికారు. ఆ తరువాత అగ్నిగుండం చివరి భాగాన పాలు ఏర్పాటు చేశారు. తరువాత గుండంలోని నుంచి నిప్పుకణికలను తీసుకుని ద్రౌపదీదేవి ఒడిలో కట్టారు. ఇక శాస్త్రోక్తంగా గుండంలోకి ప్రధాన అర్చకులు మల్లెపూల చెండు విసిరారు. ఆ తరువాత ఆలయం తరపున కలశం, పోతురాజు, గెరికను తీసుకుని అగ్నిగుండం ప్రవేశించారు. వీరి వెంట భకులకు అగ్నిగుండ ప్రవేశం కల్పించారు. అగ్ని గుండం తొక్కే భక్తులు 3,800మంది భక్తులు కంకణాలు ధరించి విచ్చేశారు. పసుపు దుస్తులు ధరించి వేపమండలు చేతబట్టి పూల కిరీటాలు, కళ్లకు కాటికతో గోవిందనామ స్మరణతో అగ్నిగుండంలో నడుస్తూ ఎదురుగా వాహనంపై ఆసీనులైన ద్రౌపదీ దేవిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అగ్నిగుండంలో అపశృతి

అగ్నిగుండ మహోత్సవంలో స్వల్ప అపశృతి చోటు చేసుకుంది. అగ్నిగుండంలోకి ప్రవేశించే ప్రారంభంలో భక్తులు తొందరపడ్డారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన నవీన్ అనే వ్యక్తి అగ్నిగుండం పడిపోయాడు. వెంటనే అక్కడున్న వారు అతడిని పక్కకు లాగడంతో స్వల్పంగా గాయపడ్డాడు. ఆ తరువాత కాసేపటికి మరో యువకుడు ఇదే తరహాలో అగ్నిగుండం అంచులో పడిపోయాడు. అయితే అతను కూడా స్వల్పగాయాలతో బయట పడ్డాడు. ఆ తరువాత అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించారు.





ద్రౌపదీదేవి ఊరేగింపు - అగ్నిగుండం వెలిగిస్తున్న ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తదితరులు

అగ్నిగుండ మహోత్సవంలో సమన్వయలోపం

భక్తుల ఇక్కట్లు

శ్రీకాళహస్తి, జూలై 21: ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన అగ్నిగుండ మహోత్సవం ఆద్యంతం గందరగోళంగా జరిగింది. అధికారుల మధ్య సమన్వయ లోపంతో భక్తులు ఇక్కట్లు పడ్డారు. ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ విఫలమైనట్లు భక్తులు పెదవి విరిచారు. ఆలయం వద్దకు వాహనాలను యధేచ్ఛగా అనుమతించడంతో మధ్యాహ్నం పొంగళ్ల సమయంలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సాయంత్రం అగ్నిగుండ మహోత్సవ సమయంలో మరోసారి ధర్మరాజస్వామి ఆలయ సమీపంలోని రహదారులన్నీ స్తంభించి పోయాయి. ఇక అగ్నిగుండం వద్ద భద్రత అంతంతమాత్రంగా కనిపించింది. ఆలయంలో నుంచి ద్రౌపదీదేవి ఉత్సవ మూర్తి అగ్నిగుండం వద్దకు చేరుకునే సమయంలో అడ్డదారిలో వచ్చే భక్తులను భద్రతా సిబ్బంది నిలువరించలేకపోయారు. రాహుకాలం ముగిసిన వెంటనే ఉత్సవమూర్తి అగ్నిగుండం వద్దకు రావాల్సి ఉంది. చాలామంది ఉత్సవమూర్తితో పాటు చొరబడేందుకు ఆలయంలో ముందుగానే తిష్టవేశారు. వారంతా అమ్మవారితో పాటు అడ్డంగా దూరడంతో సుమారు 15నిమిషాల పాటు ఉత్సవమూర్తి ఆలయం నుంచి కదలేని పరిస్థితి నెలకొంది. అగ్నిగుండంపై అష్టదిక్పాలకులకు పూజ చేయడం, ద్రౌపదీ దేవి ఒడిలో నిప్పులను మూటకట్టే ఘట్టాన్ని వీక్షించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అగ్నిగుండం చుట్టూ భారీగా చేరి అడ్డంగా నిలబడిపోయారు. వారిని కట్టడి చేయలేకపోవడంతో వెనుక ఉన్న భక్తులకు అగ్నిగుండం ఘట్టాన్ని వీక్షించేందుకు వీలులేక గగ్గోలు పెట్టారు. మొదట ప్రధాన అర్చకులు ప్రవేశించిన తరువాత భక్తులను అగ్నిగుండంలోకి అనుమతించాలి. క్యూలైన్ కట్టుదిట్టంగా ఏర్పాటు చేయకపోవడంతో ఒకసారిగా భక్తులంతా ఇష్టానుసారం అగ్నిగుండంలోకి ప్రవేశించారు. దీంతో గందరగోల పరిస్థితులు నెలకొన్నాయి.



గాయపడిన భక్తుడు

చదువుతో పేదరిక నిర్మూలన

ఏర్పేడు, జూలై 21: చదువుతో పేదరికాన్ని నిర్మూలించవచ్చని యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మునిశేఖర్, అధ్యక్షుడు వినోద్ అన్నారు. ఏర్పేడు మండలం చిందేపల్లి ఎస్టీకాలనీలో పిల్లలకు దాతల సాయంతో విద్యాసామగ్రి, బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరుణ, వలంటీరు మౌనిక తదితరులు పాల్గొన్నారు.

హోమ్ గార్డెన్స్ ఛాలెంజ్ పోటీలు

వరదయ్యపాళెం, జూలై 21: డైనమిక్ సిటిజన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి హోమ్‌గార్డెన్స్ ఛాలెంజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొప్పన శ్రీనివాస్ తెలిపారు. 6నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని చెప్పారు. ఇంటి వద్ద తోట పెంపకానికి తగినంత స్థలం, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆయా పాఠశాలల యాజమాన్యాలకు ఈ నెల 27లోపు తమ పేర్లు అందించాలని కోరారు. వారికి కూరగాయల విత్తనాలు, ఆకుకూరల విత్తనాలు అందజేస్తామన్నారు. 100రోజుల తరువాత వాటిని పరిశీలించి బాలల దినోత్సవం రోజున మొదటి బహుమతిగా 1,500, ద్వితీయ బహుమతి రూ.1,000, తృతీయ బహుమతి రూ.750 అందజేస్తామని పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

శ్రీకాళహస్తి, జూలై 21: అవధూత మాసపత్రిక వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం టాటా క్యాన్సర్ ఆస్పత్రి, రష్ సూపర్ స్పెషాలటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో పల్లమాల సుధాకర్, గిరినాయుడు, అవధూత మాస పత్రిక ఎడిటర్ ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో పిచ్చిమొక్కల తొలగింపు

రేణిగుంట, జూలై 21: రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ పరిధిలోని అన్నాసామిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పిచ్చిమొక్కలు, కొండరాళ్లతో నిండిపోయింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాదమునిరెడ్డి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సాయంతో మైదానాన్ని ఆదివారం శుభ్రం చేసే పనులను చేపట్టారు. విద్యార్థులకు క్రీడా మైదానం అందుబాటులోకి రానుండటంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

I, D. ASHRAFUNNISA W/o Ashraf Alee Mohammed R/o 12-314, Bugga Street, Renigunta, Tirupathi Dt., A.P. Have changed My Husband Name From ASHRAF ALEE MOHAMMED to D.MD.ASHRAF ALI (New Name)

AJT - 4144

CHANGE OF NAME

I, MOHAMMED ASHRAF ALEE S/o D. Abdulla (Old Name) R/o 12-314, Bugga Street, Renigunta, Tirupathi Dt, A.P. Have changed My Name to D. MD. ASHRAF ALI (New Name)

AJT - 4133

WANTED

Wanted certified AYUSH therapist (Ayurveda / Siddha/Ayush therapist) Male 2 Posts, Female 2 posts. Salary 20,000 per Month, Age limit 27years. contact : 86860 88616,77940 33341

AJT - 187461

WANTED

తిరుపతిలో ప్రముఖ హోటల్ నందు పని చేయుటకు, టిఫిన్ మాస్టర్స్, టీ మాస్టర్స్, జ్యూస్ మాస్టర్స్, సప్లయర్స్, క్లీనింగ్ స్టాఫ్ కావలెను సం.ప్ర. సెల్: 70937 35578, 91005 93958

AJT-4132

TAX CONSULTANTS

File Income Tax Returns, GST, Company Registration, ROC Fillings, Website Design, Business Registration, Vehicle Insurance, Digital Marketing at Low Prices, Call or Whatsapp 7207446677

AJT - 187457

REALESTATE

తిరుపతి ప్రతి ఏరియాలో మీకు ఓపెన్ ప్లాట్స్, ల్యాండ్స్ కమర్షియల్ ప్లాట్స్ కేటీ ఇవ్వబడును & మీ ప్లాట్స్ అమ్మించబడును తొండవాడ, చెర్లోపల్లి, మల్లంగుంట, తనపల్లి, తిరుచానూరు, రేణిగుంట ఎయిర్‌పోర్టు మంగళం : 81796 68059.

AJT - 4128

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ పేమెంట్ చేయబడును.(ట్రైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647

AJA- 189281

కావలెను

తిరుపతి శ్రీ గోపి కృష్ణ ఆయిల్ ట్రేడర్స్ నందు పనిచేయుటకు ప్యాకింగ్ యూనిట్ వర్కర్స్ (స్త్రీలు / పురుషులు) కావలెను. అకౌంట్స్ మేనేజర్ (Tally) కావలెను. సం॥ వేదాంత అగ్రహారం, తిరుపతి. సెల్: 93939 22999

AJT-187369

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పుత్తూరు వార్తలు

వైభవంగా మాతమ్మ తిరునాళ్లు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

వడమాలపేట, జూలై 21: వడమాలపేట మండలం బొమ్మరాజపురం పంచాయతీలోని అంబేడ్కర్ నగర్‌లో వెలసిన మాతమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని మేల్కొలిపి, నిత్యకైంకార్యలు చేపట్టారు. అనంతరం భక్తులు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. సర్పంచు మణిరాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని గ్రామ వీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించగా, భక్తులు నారికేలా కర్పూర నీరాజనాలతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచు రవి, వార్డు మెంబర్ భాస్కర్, కృష్ణయ్య, జయరామయ్య, వంశీకృష్ణ, నాగరాజు, గణేష్, మేకల కృష్ణయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుపూర్ణిమ ఉత్సవాలు

పుత్తూరు, జూలై 21: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపూర్ణిమ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం ఆరుగంటలకు కాగడా హారతితో ప్రారంభమై గురుచరిత్ర పారాయణం, సంధ్యాహరతి, బాజా భజంత్రీల మధ్య ఊరేగింపుతో ముగిసింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

4న గంగజాతర

పుత్తూరు, జూలై 21: పుత్తూరు తిరునాళ్ల తర్వాత ఆనవాయితీగా జరిపే పిడికిలి గంగమ్మ జాతర ఆగస్టు 4వ తేదీన నిర్వహించాలని జాతర కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఇందుకోసం ఈనెల 27న మంగళవారం రాత్రి జాతర చాటింపు వేస్తారు.

నీచరాజకీయాలు మానుకో చెవిరెడ్డీ: టీడీపీ

పుత్తూరు అర్బన్, జూలై 21: ఎన్నికల్లో చంద్రగిరి ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి బుద్ధి రాలేదని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి సిఫార్సుతోనే సీఆర్ రాజన్‌కు టీడీపీ జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టిందని చెవిరెడ్డి వ్యాఖ్యానించడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. పెద్దిరెడ్డి అనుచరుడిగా సీఆర్ రాజన్‌కు గుర్తింపు ఉంటే, గత ఎన్నికల్లో ఆయనకు ఎందుకు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించలేకపోయారో చెవిరెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక బీసీ నాయకుడిగా గుర్తింపు పొందిన సీఆర్ రాజన్ వైసీపీలో ఉన్నప్పుడు తన పక్కన కూడా కూర్చోబెట్టుకునేందుకు కూడా చెవిరెడ్డి ఇష్టపడలేదని విమర్శించారు. చంద్రగిరి నియోజకవర్గంలో చెవిరెడ్డి చేస్తున్న అవినీతి, అరాచకాలు భరించలేకే సీఆర్ రాజన్ ఆ పార్టీని వీడారని గుర్తుచేశారు. చెవిరెడ్డికి, మాజీ మంత్రి పెద్దిరెడ్డికి గ్రూప్ రాజకీయాలు ఉంటే, వారువారు తేల్చుకోవాలే గాని టీడీపీని, సీఆర్ రాజన్‌ను, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని, ఆయన కుటుంబసభ్యులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేకే చెవిరెడ్డి చౌకబారు రాజకీయాలకు తెరతీశారని ధ్వజమెత్తారు. ఇకపై బీసీలను, బీసీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ బీసీ నాయకులు ఏలుమలైరెడ్డి, పండారం మణి, సంతోష్, కాశీ, చిదంబరం, మహేష్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న షణ్ముగరెడ్డి

పుష్పయాగానికి అంకురార్పణ

వడమాలపేట, జూలై 21: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించనున్న పుష్ప యాగానికి ఆదివారం అంకురార్పణ చేశారు. తెల్లవారు జామున సుప్ర భాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం అంకురార్పణ చేశారు. మాడవీధుల్లో మేళతాలాలతో ఊరేగింపుగా సేనాధిపతి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పుట్టమట్టిని ఆలయం నుంచి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు పుట్టమట్టిని మేదినీదేవి రూపంలో అలంకరింపజేసి, మంగళ హారుతులిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మహాగోపురం వద్ద వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అంకురార్పణ గావించారు.



పూజాసామగ్రిని తీసుకెళుతున్న అర్చకులు

వేడుకగా ఎల్లమ్మ తిరునాళ్లు

వడమాలపేట, జూలై 21: కల్లూరు పంచాయతీలో వెలసిన ఎల్లమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం భక్తులు అంబళ్లుపోసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. భక్తులు పసుపు బట్టలు ధరించి, వేపాకు చేతబట్టి అగ్నిగుండ ప్రవేశం చేశారు. కార్యక్రమంలో అంజయ్య, మంజునాధ్, చెంచుకృష్ణ, దాము, మోహన్, మునిబాబు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

